# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 34 సంచిక 2

పేజీలు 40

అక్టోబర్ 2014

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................ ....... **పేజీ**


భద్రవాక్యం .......................................2

శ్రీబాబూజీ ఉవాచ...............................3

అమ్మమాట..............................................5

సన్నిధిలో సంభాషణ .............................7

ఆదిశక్తి మాతృ హృదయం.......................9

యోగవాశిష్ఠము ..................................10

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు...................12

ఆదర్శ దంపతులు ..............................14

పరిప్రశ్నేన సేవయా............................16

సద్గురు శ్రీయాత్రా దర్శన్.......................17

అందరి బంధువయా..............................19

ధ్యానం – మాధవ స్థితి.........................20

శ్రీకృష్ణకర్ణామృతము.............................22

రామరసాయనం..............................24

ప్రపంచాన్ని విడిచిపెట్టనక్కర్లేదు.............26

కర్మయోగ మహాత్మ్యం..........................27

అంతర్ దృష్టి – బాహ్యదృష్టి ....................29

దామోదరుడు..................................30

సత్సంగామృతం.................................32

హనుమద్వైభవము.............................34

సమర్థ సద్గురునాధుని దివ్య చరిత్ర..........36

విష్ణు కథలు – సదాశివ బ్రహ్మేంద్రసరస్వతి....38

హైదరాబాద్‌శాఖ భవననిర్మాణం............40

# భద్రవాక్యం

– పరాశర ప్రసాద్

కిమత్ర బహునోక్తేన శాస్త్ర కోటి శతైరపి ।
దుర్లభా చిత్త విశ్రాన్తిః వినా గురుకృపాం పరామ్ ॥

(గురుగీత శ్లో॥ 128)

చిత్తము పరబ్రహ్మమునందు లయమై ఏకాగ్రతను పొందటమే చిత్తశాన్తి అనబడుతుంది. దాన్ని సాధించటానికి ఎన్ని శాస్త్రాలు అధ్యయనం చేసినా, ఎన్ని వ్యాఖ్యానాలు చదివినా, ఎన్ని ఉపన్యాసాలు యిచ్చి ప్రజల చేత ఆహా! ఓహో! అని మెప్పు పొందినా చిత్తశాన్తి పొందటం అసంభవము.



మనస్సు యొక్క సంకల్ప వికల్పాలే చిత్తవృత్తికి కారణము. చిత్తవృత్తి రహితం కానిదే శాన్తి చేకూరదు. చిత్తవృత్తి రహితమైన మరుక్షణం యోగం సిద్ధించినట్లే.

మనస్సు నందలి సంకల్పమే దృశ్యము. సంకల్ప రహితమైనప్పుడు దృశ్యం ఉండదు. నేను, నాదిగా భావించే మనస్సే దృశ్యానికి కారణమవుతుంది. ప్రపంచమంతా దృశ్యమే. ద్రష్ట ఉంటేనే దృశ్యము. ద్రష్ట, దృశ్యము అదృశ్యమైనప్పుడు తను స్వరూపానందాన్ని అనుభవిస్తాడు. అది పొందాలంటే గురుకృపని సాధించాలి. గురూపదేశాన్ని విచారణ చేయాలి. జ్ఞేయమును ఆస్వాదించే మనస్సు జ్ఞానరూపమై పరబ్రహ్మాకారము పొందినప్పుడే చిత్తశాన్తి. అది ఇక ఏ విధంగానూ సాధ్యం కాదు.

తన యొక్క స్వరూపమే జ్ఞానము. జ్ఞానము ఆత్మకు భిన్నం కాదు. ధ్యానంలో ఏకాగ్రత సాధించి ధ్యేయంగా భావనచేసే బ్రహ్మము తానైనప్పుడు ఇక త్రిపుటికి తావెక్కడిది? త్రిపుటి రహితమైనప్పుడు చిత్తశాన్తి లభ్యమైనట్లే. చిత్తశాన్తికి ఏకైక మార్గము గురూపదేశమే అని గ్రహించాలి.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధిస్తూ "విశ్వాసమే భక్తి. తాను నమ్మిన భగవంతుని యందుగానీ, సద్గురు మూర్తియందు గానీ పరిపూర్ణ విశ్వాసం ఉన్నపుడే అది భక్తి అనిపించుకుంటుంది. నన్నే దైవంగా భావించే ఒక భక్తుడు వేరొక భక్తునితో విబేధించి నా సాన్నిధ్యాన్ని వదిలి వెళ్ళిపోవడానికి సిద్ధపడితే అది పరిపూర్ణ విశ్వాసం అనిపించు కుంటుందా!



నన్ను ఆశ్రయించిన భక్తుల మనస్తత్వాలు రకరకాలుగా ఉంటాయి. నా దృష్టిలో అంతా సమానవే కదా! మీలో మీకు వచ్చే భేదాభిప్రాయాలను మీరే సరిదిద్దుకోవాలి కానీ ఆ సమస్యలను గురుమూర్తికి నివేదిస్తే ఆయన ఏమి చేయ గల్గుతారు? ఒక తల్లికి ఇద్దరు పుత్రులు ఉన్నారు. పెద్దవాడు ఉద్యోగం చేసి తాను ఆర్జించిన ధనంతో కుటుంబ పోషణ చేస్తున్నాడు. రెండవ కుమారుడు చిన్నవాడు, చదువుకుంటున్నాడు, ఆ ఇద్దరు పుత్రులు మాతృమూర్తిని సమీపించి మా యిద్దరిలో ఎవరిని ఎక్కువగా ప్రేమిస్తున్నావు? అని ప్రశ్నిస్తే ఆ తల్లి ఏమని సమాధానం చెప్తుంది? మాతృమూర్తికి ఇద్దరూ సమానమే కదా! కావున సమాధానం చెప్పటానికి ఇరకాటంలో పడింది. ఆ తల్లి సమాధానం చెప్తూ 'మీ ఇరువురిలో ఎవరైతే నాకు వార్ధక్యంలో నా శరీరంలో పటుత్వం తగ్గిపోయినపుడు సహాయ పడతారో వారంటే నాకిష్టం' అన్నది. అలాగే సద్గురు మూర్తిని ఆశ్రయించిన శిష్యులు ఎన్ని ఇక్కట్లు వచ్చినా విశ్వాసం చెదిరిపోకుండా అంత్యకాలం వరకు నిలబడాలి అన్నారు. గురు సాన్నిధ్యంలో మాయకు స్థానం లేదు. అందువలన సాధకులు గురుమూర్తి సన్నిధిలోనే వుండాలి.

భక్తరామదాసుకి ఎన్ని కష్టాలు ఎదురైనా తాను నమ్మిన శ్రీరామ చంద్రునిపై విశ్వాసం చెదరలేదు. కొంతమంది భక్తులు మాఅబ్బాయి పుట్టినరోజనో లేక మా అమ్మాయి రజస్వల అయిందనో లేక మా పిల్లవానికి అక్షరాభ్యాసము, అన్నప్రాసన అనో చెప్పి నన్ను దర్శించి సేవించుకోటానికి వస్తారు. ఇటువంటి సందర్భాలలో క్రింద హాలులో

ఉన్న మూర్తికి హారము వేసుకొని పాదుకలకు పూజ చేసుకొని వెళ్ళమని నేను ఆదేశించినపుడు వారు నన్ను అపార్థం చేసుకున్నపుడు వారి విశ్వాసం ఎంతవరకు? గురుదేవుని పరిపూర్ణ విశ్వాసముతో ఆశ్రయించిన భక్తులు వారు ఏది ఆదేశిస్తే దానిని ఆచరించిపుడే అది విశ్వాసము అని పిలువబడుతుంది. అపుడే వారు తగిన ఫలితాన్ని పొందగల్గుతారు. నన్ను ఆశ్రయించిన భక్తులను రకరకాలుగా పరీక్షించి వారి విశ్వాసము ఎంతవరకు నిలబడుతుందో గమనించాను.

పాదపూజా మహోత్సవంలో భక్తులకు అనేక విధాలుగా రక్షని అందజేసేవాడిని. కొంతమందికి హస్తమస్తక సంయోగము ద్వారా, కొంతమందికి అభయహస్తము ద్వారా మరికొంతమందికి చిన్మయ ముద్ర ద్వారా ఆశీస్సులు అందజేస్తే కొంతమంది భక్తులు నన్ను అపార్థము చేసుకున్న సందర్భాలు అనేకం. సద్గురుమూర్తి తన ఆశీస్సులను ఏవిధంగానైనా అందజేయగల్గుతారు. దృక్‌దీక్షద్వారా కూడా ఆశీస్సులను అందజేయగల సమర్థత ఉంది. భక్తులకు తామే రక్ష అందజేయవచ్చు లేక ఎవరినైనా ఆదేశించి వారి ద్వారా రక్షని అందజేయగల సమర్థులు.

గురువును ఆశ్రయించిన భక్తుడు సంపూర్ణ శరణాగతి చెందాలి. అలా పొందిన వాడికి చేయిని అందించి మృత్యుసంసారసాగరంలో మునిగిపోకుండా రక్షిస్తాను అని భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు ఇచ్చిన హామీ వృథా అవుతుందా? గురుతత్త్వం అనంతమైనది. దానిని అర్థం చేసుకోవటం చాలా కష్టం. సద్గురుమూర్తి అందజేసే ఏ ఉపదేశమయినా, మంత్రరాజమైనా, లక్ష్యార్థము అని పిలువబడుతుంది. ఆయన చేసే ఉపదేశానికి ముసుగు అక్కర్లేదు. రహస్యము అంతకన్నాలేదు. ఆ మంత్రాన్ని మూడు పూటలా సేవించిన వారి మనస్సు నిర్మలమవకపోతుందా? అటువంటి సాధకుడు గురుబిడ్డ అనిపించుకుంటాడు. గురుబిడ్డ అనిపించుకున్న ఏ సాధకునికైనా జన్మరాహిత్యము తప్పదు! అని మీ హృదయ బాబు హెచ్చరిస్తున్నారు.

గురుమూర్తియొక్క శక్తిని ఎవరూ అంచనా వెయ్యలేరు. ఆయన సగుణంగా, నిర్గుణంగా, నిరాకారంగా తన శక్తిని ధ్యానం చేసేవారికి అందచేస్తారు. సద్గురు మూర్తి సమాధిని ఆశ్రయించి ధ్యానించినా తరించగలుగుతారు. దీనిని అర్థం చేసుకోండి" అన్నారు శ్రీ బాబూజీ మహరాజ్.

# అమ్మమాట

-జపమాలా ప్రసాద

(షోలాపూరు 22-3-2014న శ్రీనవదుర్గాలయంలో జరిగిన ప్రాతఃకాల సత్సంగ సమావేశము నుండి........)

సర్వమంగళ మాంగళ్యే। శివే సర్వార్థ సాధికే।
శరణ్యే త్ర్యంబికే గౌరి। నారాయణి నమోస్తుతే॥

జగన్మాత దయ లేనిదే జగత్తనేదే లేదు. సమస్త సృష్టికీ ఆధారం అమ్మే. 'దేహినోస్మిన్ యథా దేహే కౌమారం యౌవనం జరా।' అన్నట్లు మన నుండే అనేక అమ్మలు పుట్టుకుని వస్తున్నారు.

ఒక పాప పుడుతుంది. ఆమె తన తల్లిదండ్రులకి 'కూతురు' అవుతోంది. తాత, మామ్మలకి .మనుమరాలు' అవుతోంది. ముందు పుట్టిన తోబుట్టువులకి 'చెల్లి', తరువాత పుట్టిన వారికి 'అక్క', పెళ్ళి అయ్యాక ఒకతనికి 'భార్య', తనకే బిడ్డలు పుడితే తానే 'అమ్మ' అవుతోంది. ఈ విధంగా సృష్టిలో ప్రతిదీ మార్పు చెందేదే అని అవగాహన చేసుకోవాలి. అవస్థలు, పేరులు మారుతున్నా ఆమె మట్టుకు ఒక్కటే! ఎన్ని రూపాంతరాలు, నామాంతరాలు చెందినా, ఇన్ని అవస్థలనీ గమనిస్తూ, ఆమెలోనే ఉన్న దివ్యచైతన్య స్వరూపిణి అయిన 'అమ్మ'కు మార్పులేదు.

వాసాంసి జీర్ణాని యథా విహాయ। నవాని గృహ్ణాతి నరోపరాణి।
తథా శరీరాణి విహాయ జీర్ణాని అన్యాని సంయాతి నవాని దేహీ॥

అని గీతాచార్యుడు శెలవిచ్చినట్లు - చిరిగి, శిథిలమైపోయిన చొక్కాను వదిలివేసి, మరొక క్రొత్తచొక్కా తొడుగుకున్నట్లు, మానవుడు జీర్ణమై పోయిన ఒకదేహాన్ని విడిచివేసి మరొక క్రొత్త శరీరాన్ని పొందుతున్నాడు. కర్మలున్నంత వరకూ షర్టులు తప్పవు.

మనం దేవుడికి పూజ చేసేటప్పుడు ముందుగా ఎదుటనున్న ప్రతిమకో, యంత్రానికో, ప్రాణప్రతిష్ఠచేసి, ఆవాహితాభవ, మమ అభిముఖా భవ। స్థిరాసనం కురు। ప్రసీద ప్రసీద। అని ప్రాణప్రతిష్ఠ చేస్తున్నాము. ఆ తరువాత షోడశోపచారాలతో పూజచేశాక, ఆ పూజా ఫలాన్నంతా ఆ జగన్మాత చరణాలకే అర్పించి. చివరికి 'యజ్ఞేన యజ్ఞ మయజంత దేవాః' అని ఉద్వాసన చెప్పి, ఆవిడని వదలేసి, మనం ఇంటికి వెళ్ళిపోతున్నాము. సర్వే సర్వత్ర నిండి ఉన్న అమ్మకి ఆవాహన, విసర్జన ఏమిటి అని ప్రశ్నించారు శ్రీ ఆదిశంకర భగవత్పాదులవారు. సర్వకాల

సర్వావస్థలయందూ, సర్వేసర్వత్రా ఆ అనంత శక్తి స్వరూపిణిని దర్శించిన మహానుభావులు కాబట్టి అలా అనగలిగారు. కనీసం పూజ చేస్తున్న ఆ గంటో, గంటన్నరసేపో అయినా మీ మనస్సుని ఆ జగన్మాత యందు నిలపండిరా అని, మానవులకోసమే ఈ ఆవాహన, విసర్జనలు వచ్చాయి.

'నీ కనుసన్నులలో ఈ లోకము మొదలగునే, కనుదమ్ముల కాంతులలో - కళకళలాడుచుమనునే నీ కనుబొమ ముడిలో ఈ నిఖిలము లయమగునే' అని పాడుకుంటున్నాము. సూక్ష్మం నుండి బ్రహ్మ వరకూ నిండిఉన్నది 'అమ్మ'. 'అ' బ్రహ్మ బీజము, 'మ' అమృత బీజము అని చెప్పారు శ్రీగురుదేవులు. బ్రహ్మామృతాన్ని అందించే పరబ్రహ్మ స్వరూపిణి అమ్మ. సృష్టి, స్థితి, లయములను ఆవిడ కనుసన్నలలోనే చేయగలదు. ఆవిడకి ఏ విధమైన ప్లానింగ్ అక్కరలేదు. 'తదైక్షతా' అని ఉపనిషత్తులో వివరించినట్లు, ఆవిడ ఒక్కకసారి దృష్టి సారించేసరికి ఈ సృష్టి అంతా మొదలవుతోంది. 'కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీగణేశ్వరాయై నమః' అని అమ్మ నామం మనకిదే సూచిస్తోందేమో!

'ఈశావాస్య మిదగ్ం సర్వమ్ యత్కించ జగత్యామ్ జగత్' ఈ సృష్టంతా కూడా ఈశ్వరుడితో నిండి ఉన్నది. ఆ బ్రహ్మవస్తువు లేని, కాని, అణువు కూడా ఈ జగత్తులో లేదు అని ఈశావాస్య మంత్రం చెబుతోంది. ఆ నారాయణుడు 'అకామయత ప్రజాసృజేయేతి' అంటే కామం లేకుండా ఈ సృష్టి అంతా కూడా నారాయణుడే సృష్టించి, పెంచి చివరకి తనలోనే లయం చేసుకుంటున్నాడని నారాయణోపనిషత్తు చెబుతోంది. మరి ఒక ప్రక్క 'అమ్మ' అంటున్నారు మరొకసారి ఈశ్వరుడు అంటున్నారు, ఇప్పుడేమో నారాయణుడు అంటున్నారు. ఇదేమిటండీ అంతా కన్ఫ్యూసింగ్ తికమకగా ఉంది అనుకుంటున్నారా! అదేమీ లేదర్రా! శివుడూ, విష్ణువూ ఒకటేరా నాయనా, అని కుమార స్వామివారు 'శివాయ విష్ణురూపాయ శివరూపాయ విష్ణవే। శివస్య హృదయం విష్ణుః విష్ణోశ్చ హృదయగ్ం శివః అని స్కందోపనిషత్తులో వివరించారు.

అమ్మ, శివ, రామ, కృష్ణ, గురు - అన్నీ రెండు అక్షరాల నామాలే. వాటిలో ఏ రెండక్షరాలైనా ఫరవాలేదు. జపిస్తే చాలు జన్మ లేకుండా పోతుంది. ధ్యానిస్తే చాలు మనలోని ద్వైతం హరిస్తుంది. ఆ భగవంతుని రెండు పాదాలని ఆశ్రయిస్తే చాలు. మన పాతకములన్నీ నశించి, అహంకార మమకారములుడిగితే, అద్వైతానంద సామ్రాజ్యానికి వారసులు అవుతాము. అట్టి జగన్మాత సర్వదా కాపాడు గాక!!

# సన్నిధిలో సంభాషణ

– పరాశర ప్రసాద్

19-12-1985

“గోపాలకృష్ణుని అధరం మధురం. వదనం మధురం. ఒకటేమిటి అన్నీ మధురమే. ఎందువలన అంటే ఆయన మధురాధిపతి గనుక. ఏమంటారు పండితులు? ఆ మధురాన్ని గ్రోలటానికి మహర్షులంతా తహతహలాడేవారు. ఆయనది మీలాగా చట్టిముక్కుకాదు. డొప్పచెవులు అంతకన్న కాదు. ఆయనకి ఎత్తు పళ్ళు లేవు. ఆయనది బహు సుందరరూపము. శ్రీకృష్ణపరమాత్ముని మధుర స్వరూపాన్ని తెలుసుకోవాలంటే ఈ కవులకు అందుతుందిటయ్యా? దానిని జయదేవుడు అందుకోగలిగాడు.



దానిని అందుకోవాలంటే మీ మనస్సు గురు లక్ష్యార్థము మీద నిలిపి ధ్యానం చేస్తే దాని ద్వారా ఉద్భవించిన ధ్యానాగ్ని నీలోని మాలిన్యాన్ని శుద్ధి చేసిన తర్వాత సాధ్యపడుతుంది. గోమయం యొక్క దుర్గంధమును నదీజలాలతో గాని మరి ఏ ఇతర విధానాల వలన గాని పోగొట్టగలవా? దానిని అగ్నితో శుద్ధిచేసి పొగొట్టగలుగుతావు. అలాగే నీ మనస్సును ఆవరించిన జన్మజన్మాంతర వాసనలు రహితం కావాలంటే గురులక్ష్యార్థము ఒక్కటే శరణ్యము. గురులక్ష్యార్థము పైన ఏకాగ్రదృష్టి ఉండాలి. ఎన్ని అడ్డంకులు వచ్చినా ఆదృష్టి చలించకూడదు.

అది ఎలా ఉండాలంటే, నదీ ప్రవాహము చూడండి, ఎన్ని అడ్డంకులు ఉన్నా శబ్దం చేసుకుంటూ సాగరాన్ని చేరి సాగరరూపాన్ని పొందుతుంది. తదాకారాన్ని పొందినపుడే ఆ మధుర స్వరూపుడి మధుత్వం అందుకోగలుగుతావు. ఆ స్థితిలో ప్రకృతిలో అణువణువు మధురంగానే ఉంటుంది. అప్పుడు నువ్వు ద్వేషించేది ఏమి ఉంటుంది? పంచదార చిలక చూడండి. ఎక్కడ కొరికినా మధురమే కదా! దీనిని అర్థం చేసుకోండి చాలు.

సృష్టి ఎంత విచిత్రంగా ఉంటుందో చూడండి. గులాబి పుష్పం రంగు వేరు వాసన వేరు. మల్లెపూవురంగు వేరు, వాసన వేరు. రెండు పుష్పాలూ సుగంధాన్నే వెదజల్లుతున్నాయి. అలాగే దుర్గంధపూరితమైనవి కూడా ఉన్నాయి. మానవులలో కూడా సజ్జనులు, దుర్జనులు ఉంటారు. వారి ప్రవృత్తి జన్మాంతర వాసనలను అనుసరించి ఉంటుంది. సాధునాం దర్శనం పుణ్యం, స్పర్శనం  పాపనాశనం అన్నారు. కాబట్టి సజ్జన సాంగత్యం వలన గుణాలు హరింపబడతాయి.

గోపబాలురు, గోపకాంతలు కృష్ణపరమాత్ముని సాంగత్యము వలననే గుణరహితులయ్యారు. రాధ ఆమధురాధిపతి యొక్క మధురాన్ని అందుకోగలిగింది. ఎందువలనంటే తన హృదయంలో ఉండి తన దేహాన్ని, ఇంద్రియాలనే కాదు, సర్వప్రకృతిని ప్రకాశింపజేసేది ఆకృష్ణకాంతే అని తెలుసుకుంది కనుక. ఆప్రకాశమే లేకపోతే ఈ దేహము రక్తముతో కూడిన మాంసపుముద్ద. సర్వప్రకృతి జడమే కదా!" అన్నారు శ్రీబాబు.

## పాఠకులకు శుభవార్త!






**అనే గ్రంథం మూడు భాగాలుగా**

**వెలువడబోతోంది. మొదటి భాగం**

**అతి త్వరలో**

**మీ ముందుంటుంది.**

# ఆదిశక్తి మాతృ హృదయం

- రావి శోభ

రక్తపింజరుడు, మహిషాసురుడు వంటి ఎంతో శక్తిమంతులైన రాక్షసులను యుద్ధంలో అవలీలగా ఓడించి, ఎంతో ఉగ్రరూపంతో వస్తున్న ఆ ఆదిశక్తిని చూసిన సమస్తదేవతలు, త్రిమూర్తులు, సప్త ఋషులు పసిపాపల్లా చేతులు జోడించి భక్తిశ్రద్ధలతో చేసిన ప్రార్థనను మన్నించి వెన్నవంటి తన మాతృ హృదయంతో చల్లని చూపులతో ప్రశాంత వదనంతో ఒకమారు అలా అందర్నీ చూసిన అమ్మ ఆ ప్రదేశం అంతా అప్పుడే వాన వెలసి, చల్లని పిల్లగాలులతో అందరి మనస్సులు హాయిగా గొలిపినట్లుగా దుష్టుల నుండి కాపాడిన తమ తల్లి చెంతకు చేరిన పసి బిడ్డల్లా కనిపించసాగారు.



సంతోషంతో అమాయకమైన చూపులతో బాల్యదశలో ఉన్న త్రిమూర్తులను చూసి, మురిసిపోతూ నిండైన మాతృమూర్తిగా దగ్గరకు తీసుకుంది. ఆమె చేతిలోని చక్రాన్ని చూసి రమాపతి తన చిట్టి చేతులతో తీసుకోగా, ఏం చేస్తాడో? అని అనుకుంటూ కుతూహలంగా ఆయన చర్యను చూసింది అమ్మ. అంతలో ప్రక్కనే ఉన్న విధాత ఆమె ప్రక్కనే వున్న వేదాలను తీసుకుని అలవోకగా తన ఒడిలో పెట్టుకుంటున్న అతని పనిని ఆశ్చర్యంతో ఆనందిస్తున్న ఆదిశక్తికి మరింత ఆనందాన్ని అందివ్వాలనే ఉద్దేశంతో గిరిజాపతి బుడిబుడి అడుగులు వేసుకుంటూ వచ్చి, ఆమె చేతిలోని శూలాన్ని సుకుమారంగా తన చేతుల్లోకి తీసుకుంటున్న శంకరుని వంక సునిశితంగా చూసిన ఆదిపరాశక్తి తన పూర్వపు శాంతాకారాన్ని పొందగా ఆ మరుక్షణం పసిపిల్లల్లా భాసిల్లుతున్న త్రిమూర్తులు సయితం తమతమ రూపాలను పొందారు.

ఆ మహాశక్తి తనలో అంతర్గంతంగా విరాజిల్లుతున్న లక్ష్మీ, పార్వతి, వాణి రూపాలుగా మారి తమతమ పతులను చేరారు. ఈ జగత్ కళ్యాణాన్ని కనులారా చూసిన సమస్త దేవతా గణాలు, సప్తఋషులు, వారి మనస్సు, తనువు కూడా ధన్యత చేసుకున్నారు!

(గత సంచిక తరువాయి)

# యోగవాశిష్ఠము

-సుషుమ్న ప్రసాద

భృగు మహర్షి ఆత్మ జ్యోతి ప్రకాశముతో పవిత్రమైన మనసనే స్వచ్ఛమైన అద్దము ద్వారా, తన కుమారుని, అనేక జన్మలలో జరిగిన సంఘటనలను దివ్య దృష్టి ద్వారా దర్శించాడు. అప్పడు భృగు మహర్షి యమునితో యిలా అన్నాడు "గతంలోని నా క్రోధ జనితమైన ప్రవర్తనకు నన్ను క్షమించ వలసినది, నీవు సర్వజ్ఞుడవు, ఉత్తమోత్తమైన న్యాయ సంరక్షకుడవు నీ వొక్కడివే, పరిపూర్ణమైన త్రికాలజ్ఞుడవు, నీవు భూత, వర్తమాన, భవిష్యత్తులకు ప్రభువువు".



అప్పడు యమధర్మరాజు భృగు మహర్షి గంగాతీరాన వాసుదేవుడు తపస్సు చేసే ప్రాంతానికి తీసుకువెళ్ళాడు. వాసుదేవుడు సమాధి స్థితిలో ఉన్నాడు, వాసుదేవుడు సమాధి స్థితి నుండి బాహ్య స్మృతికి వచ్చేట్లు, యముని ఆనతిచే వాసుదేవుడు కన్నులు తెరచి, తనకు పూర్వజన్మలో తండ్రియైన భృగు మహర్షిని, యమధర్మరాజును దర్శించాడు. వాసుదేవుడు తన ఆసనము నుండి లేచి, వారిరువురికి అభివందనము చేశాడు. వారు ముప్పురు, అక్కడొక బండరాయిపై కూర్చున్నారు. వాసుదేవుడు వారినుద్దేశించి యిలా అన్నాడు, "మీ దర్శన భాగ్యము చేత నేను పవిత్రుడనై, నిత్యమైన బ్రహ్మానందమును అనుభవిస్తున్నాను.

భృగు మహర్షి తన పుత్రునాశీర్వదించి, నీవు అజ్ఞానము నుండి విముక్తడవయి, ఆత్మ జ్ఞానమును పొందెదవుగాక! దివ్యానందమును అనుభవించెదవు గాక.

వాసుదేవుడని పిలువబడే శుక్రుడు కన్నులు మూసుకొని, దివ్య దృష్టితో, తన పూర్వ జన్మ సంఘటలన్నిటినీ దర్శించాడు ఉత్తర జన్మల నుండి విముక్తుడైనాడు.

వాసుదేవుడు తన పూర్వజన్మలను గుర్తుచేసుకొని ఆశ్చర్య చకితుడైనాడు, ఆద్యంతములుకేవి ఆ దివ్యనాధుని న్యాయ ధర్మము మహత్తరమైనది. ఆ ప్రభువు దివ్య శక్తితోనే, యీ విశ్వము పరిభ్రమిస్తున్నది. నేననేక కష్టనష్టాలను అనుభవించాను, చాలా కాలము నుండి యీ సంసార చక్రములో పరిభ్రమిస్తున్నాను. ఇప్పడు నేను ఆత్మజ్ఞానమును పొంది, పునర్జన్మ కష్ట నష్టాల నుండి విముక్తుడ నయినాను. “ఓ జనకా! లేవండి, వదలిపోయిన భౌతిక కాయం మంధర పర్వతమానుల వద్ద పడి ఉన్నది. అక్కడకి వెళ్లి ఆ శరీరాన్ని చూద్దాం.

ఆ ముప్పురూ శల్యమైన ఆ శరీరాన్ని చూడటానికి మంధర పర్వతముల వద్దకు వెళ్లారు. అక్కడ వాసుదేవడు పూర్వ జన్మలో భృగు మహర్షి కుమారుడైన తన విగత శరీరాన్ని చూచాడు, అప్పడు తను తన తండ్రిగారితో యిలా అన్నాడు. “నాన్నగారూ! మీరెంతో మక్కువతో పోషకాహారాలతో పోషించిన మీ కుమారుని శరీరము అస్థిపంజరమై యిక్కడ వున్నది, ఆ శరీరమొకప్పడు చందన తైలముతో చక్కగా మర్దనచేయబడ్డది. మానవుడు మనసు నిర్మూలమైనప్పడే నిత్యానందమునను భవించగలడు. ఒక వ్యక్తి బ్రహ్మ జ్ఞానము లేక ఆత్మ జ్ఞానమును పొందినప్పడే, నిత్యానంద సాగరములో ఓలలాడుతాడు. అప్పడు మాత్రమే, భయానకమైన సంసార వ్యధ నుండి విముక్తుడవుతాడు.”

యమధర్మరాజు వాసుదేవుని ఉద్దేశించి యిలా చెప్పాడు “నీవిప్పడీ శరీరాన్ని విసర్జించి మహారాజు రాజ ప్రాసాదములో ప్రవేశించినట్లు, పూర్వ జన్మలో నీదైన విగత శరీరములో ప్రవేశించు. అసురులకు ఆచార్యుడవయి, వారికి తగిన ఆదేశాలివ్వు” అని చెప్పి యమధర్మరాజు వారికి వీడ్కోలు చెప్పి, అదృశ్యమైనాడు.

-సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమాలు

<u>అక్టోబర్ 2014</u>

1 బుధ : మూలానక్షత్రం , శ్రీ సరస్వతి పూజ, సామూహిక పూజలు
2 గురు : దుర్గాష్టమి మరియు మహర్నవమి
3 శుక్ర : విజయదశమి నామకరణములు, అన్నప్రాసనలు, అక్షరాభ్యాసములు, సామూహిక పూజలు
4 శని : ఏకాదశి ఏకాహం, దీక్షా విరమణ, మంత్రాక్షతలతో మాతాజీ ఆశీస్సులు, జగన్మాత ఊరేగింపు, రాత్రి 8 గం.లకు శ్రీసద్గురుపాదపూజ.
8 బుధ : పూర్ణిమ శ్రీమాతాజీవారి జన్మదినోత్సవము, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన
18 శని : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ
22 బుధ : మాసశివరాత్రి, నరక చతుర్దశి, శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశము.
23 గురు : దీపావళి, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన, రాత్రి 8గం.లకు టపాసులు కాల్చుట
26 ఆది నుండి నవంబరు 4మంగళ వరకు : ప్రతిరోజూ ఉదయం శ్రీరామలింగేశ్వర స్వామికి పంచామృతాలు, నవరసాలతో అభిషేకాలు, లక్షబిల్వార్చన.
27 సోమ : నాగుల చవితి.

<u>నవంబర్ 2014</u>

3 సోమ : ఏకాదశి, ఏకాహం సంకీర్తన, శ్రీసద్గురుపాదపూజ.
4 మంగళ : క్షీరాబ్ది ద్వాదశి, శ్రీసద్గురు పాదపూజ, భక్త సమారాధన
6 గురు : కార్తీకపూర్ణిమ శ్రీసద్గురుపాదపూజ, సత్సంగ సమావేశం, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు జ్వాలాతోరణం, శ్రీ ఉమారామలింగేశ్వర స్వామి నగరోత్సవం.
9 ఆది నుండి 17 సోమ వరకు : శ్రీ గురుదేవుల షట్‌వింశతి (26వ) పుణ్యారాధన మహోత్సవాలు పంచ యజ్ఞ విధులతో జరుపబడును. ది. 9-11-2014 ఆదివారం ఉదయం శ్రీమాతాజీవారిచే సప్తాహ్నిక దీక్షా స్వీకారము; రాత్రి శ్రీ సద్గురుదేవుల పుణ్యారాధన.

నిత్య కార్యక్రమాలు 9-11-14 నుండి 17-11-14 వరకు

ఉదయం 4గం.లకు మేలుకొలుపు (సుప్రభాతం); 5గం.ల నుండి ప్రార్థన, మహామంగళ హారతి; 6గం.లకు బ్రహ్మ శ్రీ కొండూరి రామ బ్రహ్మంగారిచే వేదపఠనము; ఆలయ దర్శనము, తీర్థ ప్రసాదములు; 6-30ని॥లకు శ్రీ సద్గురుపాదుకా ప్రదక్షిణము; 8 గం.లకుశ్రీ గురుగీతా ప్రవచనము - ప్రవాచకులు శ్రీజపమాలా ప్రసాద; 9గం.లకు 10-11-2014 నుండి సత్సంగ సమావేశాలు - శ్రీ మాతాజీ వారిఅనుగ్రహ భాషణము, భక్తులచే ఆధ్యాత్మిక ప్రసంగాలు ఉంటాయి.శ్రీ సద్గురుదేవుల దర్శనం(వీడియో); శ్రీబాబూజీ వాడిన వస్తువుల ప్రదర్శన (మ్యూజియం)

మధ్యాహ్నం 2గం.లకు శ్రీసద్గురు శత సహస్రనామార్చన, మహామంత్ర పుష్పం, దర్బారు. సాయంత్రం 5గంలకు శ్రీమాతాజీవారు తీర్థమిస్తారు. అనంతరం భక్తసమారాధన. 6గం.లకు ప్రార్థన, మహామంగళ హారతి. ప్రతిరోజూ అఖండ హరినామ సంకీర్తన. అఖండ పారాయణ, అఖండ ధ్యానము, కోటి సద్గురు నామ పారాయణ.

17.11.14 సోమ, శ్రీగురుదశమి - తె.జా 3గం.లకు శ్రీగురుదేవులకు బృందావనంలో నమక, చమక సహిత మహాభిషేకం. సద్గురు పాదపూజ.

విశేష కార్యక్రమాలు

9-11-14 ఆదివారం రాత్రి 7గం.లకు శ్రీసద్గురుదేవుల పుణ్యారాధన.

15-11-14 శనివారం రాత్రి 7గం.లకు ఊంజల సేవ. (డోలోత్సవం)

16-11-14 ఆదివారం శ్రీగురుదశమి.

ఉదయం 7గం.లకు శ్రీసద్గురుదేవుల సామూహిక సద్గురుపాదపూజలు. సాయంత్రం ప్రార్థనానంతరం దీపోత్సవం. అనంతరం శ్రీసద్గురుదేవుల పుణ్యారాధన.

17-11-2014 సోమవారం తెల్లవారుజామున 3గం.లకు శ్రీ సద్గురు దేవులకు రుద్ర నమక చమక సహిత మహాభిషేకము. ఉదయం 5గం.లకు ప్రాతఃకాల సద్గురుపాదపూజ అనంతరం దీక్షావిరమణ. సాయంత్రం 6గం.లకు నగరోత్సవం అనంతరం తెప్పోత్సవం. (నౌకావిహారం)

20 గురు : మాసశివరాత్రి

22 శని : అమావాస్య

28 శుక్ర: శ్రీ సుబ్రహ్మణ్య షష్ఠి, స్వామికి అభిషేకము, సహస్రనామార్చన

# ఆదర్శ దంపతులు

- ఓం కాళీ

కాంచీపురంలో దామోదరుడు అనే బ్రాహ్మణుడు తన భార్యతో కలసి భిక్షమెత్తుకుని జీవిస్తూ ఉండేవాడు. వారికి సంతానం లేరు. ప్రొద్దున లేవగానే కాలకృత్యాలు తీర్చుకుని, భగవన్నామ సంకీర్తన చేస్తూ భిక్షకు వెళ్ళి ఆ రోజుకు ఏది ప్రాప్తిస్తే దానినే భగవంతునికి నివేదించి తాము భుజిస్తూ ఉండేవారు. ఎవరైనా అతిథి వస్తే ఆ ఉన్నది ముందుగా వారికి పెట్టి తరువాత తాము మిగిలితే తినేవారు లేకపోతే ఉపవాసం చేసేవారు. ఇదీ వారి దినచర్య.

ఒక రోజు అసలు వారికి ఒక్క గింజ కూడా భిక్ష దొరకలేదు. భార్యాభర్తలిద్దరూ పరమేశ్వరుని ప్రార్థిస్తూ "స్వామీ! ఈ రోజు ఏమీ దొరకలేదు. మాకు ఫరవాలేదు. కాని ఇంటికి ఎవరైనా అతిథి వస్తే ఎలాగు? అన్నదే మా భయం. నీవు సర్వరక్షకుడవు. నీదే భారం ప్రభూ!" అని వేడుకుంటుంటే, ఈలోగా పరమేశ్వరుడు వీరి త్యాగబుద్ధిని పరిశీలించ దలచి, ఒక ముదుసలి సన్యాసి వేషంలో అతిథిగా ఆ బ్రాహ్మణుడి ఇంటికి వచ్చాడు. కదలలేని నీరసంతో ఉన్నట్లు నటించాడు. ఆ బ్రాహ్మణుడు గబగబా బయటకు వచ్చి అలసిపోయి, నీరసంతో ఉన్న ఆ తేజోమయ సన్యాసిని లోపలికి తీసుకువచ్చి నమస్కరించి, "స్వామీ! ఈ దీనుణ్ణి ఆజ్ఞాపించండి ఏ సేవ కావాలో" అని అర్థించాడు.

వెంటనే ఆ సన్యాసి "నీవు ఎంతో భక్తుడవని, అతిథి సేవ చేస్తావని విని, నీ దగ్గరకు గంపెడు ఆశతో వచ్చాను. ఆకలి పీడించి వేస్తోంది. నాకు కాస్త అన్నం పెడతావా?" అని దీనంగా అడిగాడు. "అలాగే. స్వామీ మీరు విశ్రాంతి తీసుకోండి" అని చెప్పి, దామోదరుడు లోపలికి వచ్చి భార్యతో "ఇప్పుడు ఈ సమస్య తీర్చటం ఎలా?" అని అడిగాడు. ఆమె వెంటనే " మనకు ఆ సదాశివుడే ఏకైక రక్షకుడు!" అని చెప్పి కత్తెర తీసుకుని తన పొడుమైన జుట్టును సగానికి కత్తిరించి భర్త చేతికిచ్చి "దీనిని అమ్మి ఆ సొమ్ముతో పదార్థాలు తీసుకురండి" అని చెప్పి పంపించింది. అతను అలాగే చేశాడు. ఆమె వండి, అతిథికి వడ్డించింది. మొత్తం వండినదంతా తినేశాడు.

"అమ్మా! చాలా రోజుల తరువాత ఇటువంటి రుచికరమైన భోజనాన్ని తిన్నాను. నాకు చాల తృప్తిగా ఉంది. నేను అలసిపోయాను.

ఇప్పుడు వెంటనే ప్రయాణం చేయలేను. ఈ రాత్రికి కూడా ఇక్కడే ఉండి భోజనం చేసి ప్రొద్దుటే లేచి వెళ్ళిపోతాను" అన్నాడు ఆ సన్యాసి రూపంలో ఉన్న పరమేశ్వరుడు వారిని పరీక్షించదలచి.

ఆ భార్యాభర్తలిద్దరూ మనస్సులో రాత్రికి ఎలాగ ఏర్పాటు చేయాలి అనే ఆలోచనలో పడి, కొంతసేపటికి భార్య తన మిగతా జుట్టునంతా కూడా కత్తిరించి యిచ్చి, రాత్రికి భోజన సదుపాయం చేసింది. ఆ సన్యాసికి రాత్రికి ఎంతో తృప్తి కలిగేలా వడ్డించి, ఆ భార్య భర్తలిద్దరూ గడ్డితో ఆయనకు పడక ఏర్పాటు చేసి, ఆయన పాదసేవ చేశారు. ఆ పరమేశ్వరుడు ఎంతో తృప్తిగా భోజనం చేసి, హాయిగా గడ్డి పాన్పు మీద విశ్రమించి, భక్తుల హృదయాలలో శయనించే భగవానుడు ఈ బీదవాని గుడిసెలో గడ్డిపరకలపై ఎంతో ఆనందంగా పవళించాడు.



బ్రాహ్మణుడు పాదములు వత్తుతున్నాడు, భార్య చీరకొంగుతో విసురుతోంది. ఎంతో హాయిని అనుభవిస్తున్నాడు కైలాసం కన్న మిన్నగా ఉంది ఇక్కడ.

రేపటి రోజు పెందరాళే భిక్షకి వెళ్ళి రేపు కూడా స్వామికి భోజనం పెట్టి అప్పుడు పంపుదామని మనస్సులో వారిరువురూ అనుకుంటున్నారు. త్రికాలజ్ఞుడైన పరమేశ్వరుడు వారి ప్రేమకు చలించిపోయాడు. ఉపవాసంతో నీరసించిపోయిన ఆ దంపతులు అలాగే స్వామి పాదాలపైనే పడి నిదురించారు. పరమేశ్వరుడు లేచి ఆ పతివ్రత తలపై తన హస్తంతో నిమిరి ఆశీర్వదించి అంతర్ధానమయ్యాడు.

ఆ భార్యాభర్తలిద్దరూ తెల్లవారి లేచేసరికి, ఆమె నెత్తిమీద జుట్టు యథాప్రకారం ఉంటుంది. ఒంటి నిండా బంగారు ఆభరణాలతో నిండిపోయింది. ఆ పాక పెద్ద మహల్‌లాగా మారిపోయింది. వారిద్దరూ ఆశ్చర్యంతో ఆ వచ్చిన అతిథికోసం వెతకగా ఎక్కడా కనబడ లేదు. సాక్షాత్ ఆ పరమేశ్వరుడే అతిథిరూపంలో వచ్చి పరీక్షించి మనలను పరిరక్షించాడని అర్థం చేసుకున్న ఆ భక్త దంపతులు ఎంతో ఆనందించి బ్రతికినంతకాలం దానధర్మాలతో, భగవన్నామ సంకీర్తనతో జీవితం గడిపి అంత్యకాలంలో ఆ పరమేశ్వరుడిలో ఐక్యమయ్యారు!

# పరి ప్రశ్నేన సేవయా

– పరాశర ప్రసాద్

'అజ్ఞానం అంటే ఏమిటి? అజ్ఞానానికి హేతువేమిటి?' అన్న ప్రశ్నకు సమాధానంగా సద్గురుదేవులు మాట్లాడుతూ "మానవుడు నిత్యముక్తుడే. దివ్యత్వం గలవాడే సుమా! శాశ్వతం, అద్వయం, ఆధారం అయిన ఆ సచ్చిదానంద స్వరూపానికి భిన్నత్వం కాదు. అయితే అతని వర్తమాన అనుభవాలైన బాధలు దుఃఖాలు, జనన మరణాలు అనేవి కాదనగలవారెవరైనా ఉన్నారా? అయితే దానికి కారణం సత్యాన్ని మరచి త్రిపుటిలో చిక్కుకోవటం వలననే అజ్ఞానంలో ఉన్నాడు.



అజ్ఞానమే అన్ని క్రియలకు హేతువు. అజ్ఞానం ఏ కర్మవలనో జనించింది మాత్రం కాదు. కర్మ చేయటం వలన ఫలితం అనుభవించక తప్పదు అది యదార్థమే. అది సుఖాన్ని ఇవ్వవచ్చు లేదా దుఃఖాన్ని ఇవ్వవచ్చు. కాని అజ్ఞానం అటువంటిది కాదు. దీపం లేకపోతే అంధకారం ఎలా కలుగుతుందో, సూర్యుడు అస్తమించినప్పుడు చీకటి ఎలా ఆవరిస్తుందో అలాగే జ్ఞానము మరుగైనప్పుడు అజ్ఞానం గోచరిస్తుంది. చీకటినిగాని, రాత్రినిగాని తొలగించగల శక్తి లేదు కదా! కాంతితో చీకటి మాయం అవుతుంది. అలాగే అజ్ఞాన్ని తొలగించగల ఏకైక మార్గం జ్ఞాన సముపార్జన మాత్రమే.

మానవాళికి జ్ఞానాన్ని పొందే ఏకైక మార్గం గురువాక్యం లేదా గురుబోధ. సద్గురు మూర్తి ప్రబోధించిన ఉపదేశం మననానికి విచారణకి రావాలంటే ముందుగా విధి నిషేధాలను పాటించాలి. వాటి ద్వారా చిత్త శాన్తి చేకూరుతుంది. చిత్తశాన్తి చేకూరిన మరుక్షణం సద్గురుమూర్తి బోధయందు ఆసక్తి జనించి శ్రవణము చేసిన గురుబోధ మననము నిదిధ్యాసకి వస్తుంది. ఆ క్షణమే సాధకుడు అనుభూతిని పొందుతాడు. గురూపదేశము సఫలీకృతం కావాలంటే సాధకుడు విధినిషేధాలను తప్పక పాటించాలి. విధినిషేధాలను పాటించటానికి అవసరమైనది తాను ఆశ్రయించిన సద్గురుమూర్తి యందు పరిపూర్ణ విశ్వాసం పెంపొందించుకోవటం" అన్నారు.

(గత సంచిక తరువాయి) **సద్గురు శ్రీ యాత్రా దర్శన్** -పి. సుధారాణి

స్థల పురాణం 1. -

అక్బర్ పరిపాలనలో రాజపుత్రులు మనిమజ్ర స్థలానికి జమిందారులుగా ఉండేవారు. ఒక సంవత్సరం కరువు మూలంగా వారు పన్ను కట్టలేకపోయారు. అక్బర్‌చక్రవర్తి వారికి జైలుశిక్ష విధించాడు. ఆ విషయం తెలిసిన గరీబ్‌దాస్ అనే భక్త కవి సామూహిక యజ్ఞం ఆచరించి మానసాదేవిని ప్రత్యక్షం చేసుకున్నాడు. అమ్మ అతని కోరిక ఏమిటని అడుగగా అతడు జమిందారులను కారాగృహ విముక్తి చేయమని కోరాడు. అమ్మ అతని త్యాగబుద్ధికి సంతోషించి, కోర్టుతీర్పు జమిందార్లకు అనుకూలంగా వచ్చేలాగ అనుగ్రహించింది. ఆ సంవత్సరంలో పన్ను మినహాయింపు కూడా జరిగింది. ఈ విషయం విన్న జమిందారులు అమ్మవారికి ఆలయం కూడా నిర్మించారు.

ఆ తరువాత భక్తుడైన పాటియాల మహారాజుకి జగన్మాత స్వప్నంలో దర్శనమిచ్చి, ఆలయం నిర్మించమని ఆదేశించగా ప్రస్తుతం మేము చూసిన మహా ఆలయ నిర్మాణం జరిగింది. పాటియాల రాజు ప్రతిష్ఠించిన దుర్గ అమ్మవారిని కూడా మేము దర్శించుకుని వచ్చాము. బస్సులో బయలుదేరి చండీఘడ్ నుండి సిమ్లా వెళ్ళే రైల్వే లైన్‌లో ఉన్న 'కాలీకాజీ' స్టేషన్ వద్ద ఉన్న "కాళికాదేవి" అమ్మవారిని దర్శించుకున్నాము. పురాతనమైన, అందమైన, చిన్న ఆలయం. పిండి రూపం. పిండి అంటే రాయి. అనేక ఆలయాలలో అమ్మవారు పిండిరూపంలో ఉన్నారు. అమ్మవారి తలవెంట్రుకలు ఇక్కడ పడినట్లు స్థల పురాణం. శక్తి పీఠంగా అంగీకరించక పోయినా, భక్తులను ఆ తల్లి మహిమలు అయస్కాంతం లాగా ఆకర్షిస్తుంటాయి.

స్థల పురాణం 2. -

రాజా జయసింగ్ ఇక్కడ కాళీమాతను ప్రతిష్ఠించాడు. నవరాత్రులలో భక్తులు అమ్మవారి అర్చన చేస్తారు. రాజ ప్రాసాదంలోని స్త్రీలు కూడా చక్కగా గానం చేస్తూ కీర్తిస్తున్నారు. దివ్యమైన తేజస్సుతో కాళికామాత ఆ స్త్రీలతో కలిసి కూర్చుని గానం చేస్తుండగా, మహారాజు ఆమె దివ్య సౌందర్యానికి మోహితుడై ఆమె చేయి పట్టుకున్నాడు. ఆమె

అతడిని వరం కోరుకొన మనగా అతడు తనను వివాహం చేసుకోమని కోరాడు. ఆ తల్లి ఆగ్రహంతో నీ రాజ్యమూ, వంశమూ నాశనమవుతాయని శపించింది. ఆలయం భయంకరమైన శబ్దములతో దద్దరిల్లుతుండగా దేవి విగ్రహం భూమిలోకి క్రుంగిపోసాగింది. ఆలయం వెనుక తపస్సు చేసుకుంటున్న ఒక సాధువు అమ్మను స్తుతించి ప్రార్థించగా, అమ్మ తల మాత్రం నిలిచింది. అదే పిండి రూపంలో ఉన్న అమ్మవారు. ఆ రాజు తన రాజ్యం వంశంతో పాటు శత్రువుల బారిన పడి నశించాడు.

కాలికాజీ వద్ద నుండి బయలుదేరి ఆ రాత్రికి సిమ్లా చేరాము. చైల్ అనే ఊరిలో హోటల్‌లో బస చేశాము.

-సశేషం

## మాయను ఎలా వదిలించుకోవాలి?

"తీవ్ర వైరాగ్యం అలవడినప్పుడు మనకు భగవత్సాక్షాత్కారం కలుగుతుంది. కామినీ కాంచనాలే మాయ. మనం ఎప్పుడు ఈ విషయాన్ని తెలుసుకుంటామో అప్పుడు మాయ మనని వదలి పారిపోతుంది.



ఒకడు పులితోలు కప్పుకొని మరొకణ్ణి భయపెట్టడానికి ప్రయత్నించాడు. వాడు బెదరుకుండా 'ఓరేయ్! హరీ! నువ్వెవరవో నాకు తెలుసులేరా! వేషం వేసినంత మాత్రాన నిన్ను కనిపెట్టలేనా?' అన్నాడు.

దానితో ఆ పులితోలు కప్పుకున్నవాడు నవ్వుతూ మరొకణ్ణి బెదిరించటానికి వెళ్ళిపోయాడు" అని మాయను ఎలా వదలించు కోవాలో శ్రీరామకృష్ణులు తెలియజేశారు.

# అందరి బంధువయా!

–పెనుమాక నాగేశ్వర రావు

అందరి బంధువయా ఆనంద నిలయా
కరుణా సింధువయా కాళీప్రసాద సామివయా
కమనీయ మూర్తివయా మహనీయ స్ఫూర్తివయా
ఎనలేని మహా మహా మహా దయామయవయా ॥అందరి॥

అందరి సొంతమయా అనురాగ మూర్తివయా
కరుణాజలధి వయా కాళీప్రసాద స్వామివయా
ఆత్మీయ దైవమయా మా ఆచార్య దేవులయా
సరిలేని మహా మహా మహా మహోదయా ॥అందరి॥

అందరి సంపదయా మీ సన్నిధే మా సంపదయా
కరుణాపయోనిధివయా కాళీప్రసాద స్వామివయా
రమణీయ చరితులయా రాజీవ నేత్రులయా
తుదిలేని మహా మహా మహా మహాశయా ॥అందరి॥

అందరి స్వర్గమయా మా ముందరి స్వర్గమయా
మీ సన్నిధే మా స్వర్గమయా మా పెన్నిధయా
మా జన్మలు స్వర్ణమయా ధన్యమయా
కనలేని ఎనలేని సరిలేని తుదిలేని
మహామహా మహాపురుషులయా పురాణ పురుషులయా! ॥అందరి॥



(గత సంచిక తరువాయి) **ధ్యానం – మాధవ స్థితి (1)** - రేఖ

అక్రూరుడు, శ్రీకృష్ణపరమాత్మను మధురకు తీసుకువెళదామని రేపల్లెకు వచ్చినప్పుడు రాధమ్మ దగ్గరకు శ్రీకృష్ణుడు వెళితే రాధమ్మ అంటుందిట ఆయనతో నేను వెళ్ళమంటేనే కదా నీవు వెళ్ళేది అని. దానికి శ్రీకృష్ణ పరమాత్మ “నేను వెళ్ళకపోతే, నా అవతార కార్యక్రమం నెరవేర్చక పోతే లోకం ఏమనుకుంటుంది”అన్నాడు. దానికి రాధమ్మ సమాధానం చెబుతూ శ్రీకృష్ణ తత్వం అర్థం చేసుకున్నవారేగదా రాధామనోహరుడనీ, రాధాహృదయుడనీ అంటారు’ అన్నది. మన హృదయ నివాసి కూడా. మన దగ్గర లేకుండా మనుగడ ఎలా జరుగుతుంది? అన్నారు మాతాజీ. కృష్ణుడే రాధావతారం ఎత్తాడని కొందరు అంటారని మాతాజీ అన్నారు.

సాధకుడికి ధైర్య సాహసాలు ఎంతో అవసరం అని చెబుతూ ప్రహ్లాదుడు అహంకార మమకారాలకి లోనవలేదు. నేను, నాది, నా శరీరం అనుకుంటే తండ్రిగారు పెట్టిన కష్టాలు ధైర్య సాహసాలతో ఎదుర్కొనేవాడా? అని ప్రశ్నించారు. గురూపదేశం ప్రకారం ఆనారాయణ నామాన్ని మరువలేదు. నిరంతరం ఆ స్మరణలో ఉన్నాడు కాబట్టే తండ్రి పెట్టిన కష్టాలను ఎదుర్కొన్నాడు. అందుకనే పాములతో కరిపించబోయినా, వేడి నూనెలో పడవేయ బోయినా చలించలేదు. నారాయణ కవచం ధరించి ప్రతి విషయాన్ని ధైర్య సాహసాలతో ఎదుర్కొన్నాడు. ఆ గురుదేవుడి పాదాలను ఆశ్రయించాం కాబట్టే ఆ ధైర్య సాహసాలు మనకి కూడా ఉన్నాయి. ఈ దేశం వచ్చాము.

రాముడు గొప్పవాడు. రాముడు నడచిన మార్గంలో నడిస్తేనే ఆనందం. మానవ జీవితానికి సార్థకత. రాముడి సుగుణాలు, సౌందర్య శీలం మానవుడు అలవరచుకుంటేనే ఆనందం. రాముడు అనుసరించిన సత్య మార్గం, ధర్మ మార్గం మానవుడి మనస్సు మీద ఎంత ప్రభావం ఉంటోంది అని విచారణ చేసి ఆ మార్గంలో పయనించాలి. పెద్దలు వారు ఆచరించి చూపించారు.

శ్రీగురుదేవులు మనకి ఏది దొరికితే దానితో సరిపెట్టుకోవటం

నేర్పించారు శ్రీగురుదేవులు. మహాత్ములు ఎన్ని కష్టాలు వచ్చినా వారి భారం వారు మోసుకుంటూ వారికి ఉన్నంతలో యితరులకు కూడా పెట్టేవారు. సేవ చేశారు. బాహ్యాలంకారాలు కాదు కావలసినది. మంచి గుణాలతో మనస్సను అలంకరించుకోవాలి. ఆ అలంకారం బాగుంటుంది.

ఈ విధంగా మహాత్ములు చూపిన ట్రాక్ మీద మనస్సునీ, జీవితాన్ని పెట్టుకుని విచారణ ద్వారా లోపలికి లోతుకి వెళ్ళి కదలికలను గుర్తిస్తూ ఎందుకంటే ప్రతి అణువులోనూ ఉన్న సత్యం తనలోనూ ఉంది అన్న విషయం అవగాహనకు వస్తుంది. ఈ ప్రకారంగా మహాత్ముల బోధ మననం చేసి, ప్రాతిభాసికంగా తన జీవితాన్ని ఆచరణలో పెట్టిన మానవుడు తన గమ్యస్థానాన్ని చేరగలడు. అట్టివాని జన్మ ధన్యత చెందుతుంది.

అన్ని చింతనలు వదిలిపెట్టి మానవుడు శ్రవణం చేయాలి. శ్రవణం చేసిన దానిని మననం చేయాలి. దాని యందే ధ్యాస కలిగి ఉండాలి. జనక మహారాజు గీతను ఆశ్రయించే కైవల్యాన్ని పొందాడని గీతామహాత్మ్యంలో చెప్పబడి ఉంది. జనకుడు, యాజ్ఞవల్క్యుడు యితర మహర్షులెందరో నిరంతరం అటువంటి జ్ఞాన చర్చలలో మునిగి ఉండేవారు. జ్ఞానానికి ఆవేదన ఉండాలి. జీవిత రహస్యం లోతైనది. లోపలికి వెళితేనే అమృతం అందుతుంది, ఆనందం అనుభవించ గలుగుతాం.

మహాత్ముల లీలలు, సన్నిధి మనం ఎంత ఆనందిస్తున్నాము? అని మనలను మనమే ప్రశ్నించుకోవాలి. వారి సమీపంలో ఉండాలనే తీవ్ర పట్టుదల మనలో ఉండాలి. అంటే వారి మార్గాన్ని అనుసరించే ప్రయత్నమే ధ్యానం. తనని తాను మరచి, ఇంద్రియాలన్నిటినీ తాబేలులా లోపలకి తీసుకుని, ఓంకారం పూరించాలి. ఓంకారం నాభి నుండి పూరించాలి. ఏపని చేస్తున్నా ఆ దివ్య పాదారవిందాలు నీ మనస్సులోనే ఉన్నాయని గుర్తిస్తే, సుడిగుండాల్లో పడిపోకుండా గమ్యస్థానం చేరుకుంటావు. ఆ ప్రయత్నమే ధ్యానం.

-సశేషం

గత సంచిక తరువాయి

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

35. శ్లో భావేన ముగ్ధ చపలేన విలోకననేన
మన్మానసే కిమపి చాపల ముద్వహన్తమ్
లోకేన లోచన రసాయన మీక్షణేన
లీలా కిశోర ముప గూహితు ముత్సుకోఽస్మి ।

తాత్పర్యము -

ముగ్ధ చేతలతోను, సుందరము చంచలమైన చూపు చేతను నా చిత్తమునకు మేరలేని కలవరము కలిగించుచూ కనులకు అమృతపు కణిక యగు వింత పిల్లవాడిని నా కన్నులారా కౌగలించ కోరుతున్నాను.



శ్రీమంతులదెవరిదో గొడ్లపాక, ముత్తవ్వ నివాసం. అది ఊరి చివరిగా ఉంది. అనాధ పేదరాలు అయిన ముత్తవ్వ. ముందు వెనకలు ఎవరికి తెలియవు. ఎడ్లకు మేత వేసేందుకు, దాణా పెట్టేందుకు మనుషులు వస్తారు. ఉలవలు, వడ్లు కలిపి వుడకపెట్టే దాలిలోనుంచి నిప్పు తీసుకుని పాకలో మూలగా ఉన్న పొయ్యిలో వేసుకుని, ముత్తవ్వ కుండలో అన్నం వండుకుటుంది. కాపలావాళ్ళు తాము తెచ్చుకున్న అన్నంలో నుండి కూర, పచ్చడి రవ్వంత తీసి యిస్తుంటారు. ముత్తవ్వకి ఇదే విందుభోజనం. ఒక బొంత వేసుకుని గొంగళి కప్పుకుని పడుకుంటుంది. అదే పట్టుపాన్పు ఆమెకి. ఆ చోటు విడిచి పొమ్మనమని అదిలించలేదెవరూ ఎన్నడూ.

ప్రొద్దున్న పూట అడవిలోకి వెళ్ళి రేగిపళ్ళు ఏరుతుంది. అది వెదురు బుట్టలో పెట్టుకుని ఊరిలోకి వెళ్ళి నాలుగు ఇళ్ళల్లో అమ్ముతుంది. గుప్పెడు బియ్యానికి దోసెడు పళ్ళు యిస్తుంది. ఆ గుప్పెడు బియ్యం పోగవ్వగానే పాకలోకి పోయి కూడు వండుకుంటుంది. పిల్లలకి రేగిపళ్ళు అంటే ఇష్టం. అందుకే పిల్లలున్న ఇళ్ళదగ్గరకి వెడుతుంది.

ఆనాడు అలవాటుగా పళ్ళు అమ్ముకుంటూ పోతుంటే ఒక ఇంటి ముందు కాళ్ళు ఆగిపోయాయి. కలవారి యిల్లులాగ ఉందనుకుంటూ వాకిట్లో నిలబడి "తల్లీ! రేగిపండ్లు, నేరేడు పండ్లు కొంటారా?" అని ఒక

కేక పెట్టింది. తలుపులు అన్నీ వరుసగా తెరిచే ఉన్నాయి. లోపల గుమ్మడి పండంటి బిడ్డ ఆడుకుంటూ నీలిరంగు బంతిలాగ కనిపించాడు. ముత్తవ్వకి వాడిని చూసేసరికి ముద్దువచ్చి ఒక్క అడుగు లోపలికి వేసింది. 'పళ్ళమ్మో!' అని పిలుస్తూ, పిల్లవాడిని చూస్తూ నిలబడింది. 'వచ్చె వచ్చే' అనే మాట వినబడింది.

ముత్తవ్వ కళ్ళను మెరిపించిన ఆ ముద్దు బాలుడు చేతిలో ముత్యాల దండ పట్టుకుని తెంపి నేల మీద విరజిమ్ముతున్నాడు. "నా తండ్రీ! ఏం చేస్తున్నావయ్యో?" అంటుంటే చేతి నిండా ముత్యాలు పట్టుకు వచ్చి చేతులు జాచి పిలుస్తున్న అవ్వ దోసిలి నిండా పోశాడు. అంతలో తల్లి వచ్చింది.

"ఎవరమ్మా? నీవు ఏకంగా లోపిలికి వచ్చేస్తున్నావు?" అని కసిరింది పళ్ళు అమ్ముకునే ముసలిదాన్ని. "తల్లీ! బియ్యానికి పండ్లు ఇస్తాను. నీ పిల్లవాడు ఇదిగో ముత్యాలన్నీ నా దోసిట్లో పోశాడు. తీసుకుని భద్రం చెయ్యమ్మా" అని అంటుంటే ఆ తల్లి వింతగా చూస్తూ "నీ చేతిలో ఉన్నవి బియ్యమేనే! కళ్ళు సరిగా కనబడటం లేదా?" అంది. ఉలిక్కిపడింది ముత్తవ్వ. కుఱ్ఱాడు వాళ్ళమ్మ కొంగుచాటున నిలబడి చూస్తున్నాడు ఏమీ తెలియని అమాయకుడిలాగ.

"వీడికి బియ్యం ఎక్కడవి? ఓహో! నా మతిమరుపు చల్లగుండా గిన్నెలో బియ్యంపోసి పొయ్యి మీద పెట్టాలనుకుంటూ మరచిపోయి ఇంకో పనిలో మునిగాను. ఆ బియ్యం వాడికి కనిపించాయి. ముత్తవ్వకి అంతా అయోమయంగా ఉంది. తాను కళ్ళారా చూసింది, పిల్లాడు తెచ్చి పోసినవి ముత్యాలే! "సరే! ఆ పండ్లు ఇలా పోసి, బియ్యం పట్టుకెళ్ళు" అంది. ఎందుకో ఒళ్ళు పొంగింది ముత్తవ్వకి.

"రేపు కూడా మంచి పళ్ళు తెస్తాను తీసుకోండమ్మా!" అని వాకిలి దాటింది. రాత్రి కూడా నిద్రపోకుండా ఆలోచిస్తూనే ఉంది. తను అబద్ధం ఆడలేదు కదా! అని. తెల్లవారింది. ఎండఎక్కాక రోజూ కన్నా ఎక్కువ పళ్ళు కోసింది రేగి కంప గుచ్చుకుంటున్నా లెక్కచేయకుండా. పండ్లు మంచి రసంగా ఉన్నాయి. సరాసరి ఆ తల్లి పిల్లోడున్న ఇంటికే వెళ్ళింది. పండ్లు తెచ్చానమ్మా! త్వరగా రండి నేను పోవాలి" అంది గట్టిగా.

-సశేషం

# రామ రసాయనం

- జి.వి

"శరభోజమహారాజు కుపితుడయ్యాడు. అధికార దర్పం ఆయనలో పెల్లుబికింది. తన సాటి రాజు కూడా కాడే. ప్రతి రోజూ వీధుల వెంబడి పాటలు పాడుతూ భిక్షమెత్తుకు జీవించే ఒకవ్యక్తి తన ఆహ్వానాన్ని కానుకలను తిరస్కరించడమా! అతడు రామభక్తుడే కావచ్చు. రాజు ముందు అతడి శక్తి ఎంత?



శరభోజి ఒక నిర్ణయానికి వచ్చాడు. తన ఆహ్వానాన్ని తృణీకరించిన వ్యక్తికి గుణపాఠం నేర్పదలచాడు. రాజుగారి ఆగ్రహానికి గురియైనది ఎవరో తెలుసా? ఆయనే వాగ్గేయకారుడు త్యాగయ్య. శరభోజి తన నిర్ణయానుసారం త్యాగయ్యను పట్టి బంధించి తీసుకు రమ్మనమని తన భటులను ఆజ్ఞాపించాడు. 'చిత్తం ప్రభూ' అంటూ వాళ్ళు బయలు దేరారు. రాజభటులు నగరం పొలిమేర దాటారోలేదో శరభోజమహారాజుకు కడుపులో నొప్పి బయలుదేరింది. రాజు వైద్యశాస్త్రం కూడా ఎరిగిన వాడే. అందువల్ల తనకు మించిపోతుందా అన్న ధీమాతో ఏదో ఔషధం కూడా సేవించాడు. దానివల్ల ఫలితం లేకపోగా నొప్పి తీవ్రతరమైనది. రాజవైద్యుణ్ణి పిలిపించారు. ఆయన తన శాయశక్తుల ప్రయత్నించాడు కాని లాభం లేకపోయింది.

రాజుపడే బాధ చూసి అక్కడ వారందరూ బిక్కమొహం వేశారు. ఆ సమయంలో రాజుగారి మూడవ మంత్రి వచ్చాడు. ఆయన పరమ వైష్ణవ భక్తుడు. విషయం అంతా తెలుసుకున్న తరువాత "ప్రభూ! నేనే స్వయంగా త్యాగయ్య దగ్గరకు వెళ్ళివస్తాను" అన్నాడు. వద్దనలేక పోయాడు శరభోజి.

త్యాగయ్యరోజూ ఉంఛవృత్తి నుండి ఇల్లు చేరుకున్న తరువాత శుచియై రామచంద్ర ప్రభువును తులసీదళాలతో అర్చించడం అలవాటు.

పూజాదికాలు ముగిసిన తరువాత మంత్రి తన రాకను గురించి త్యాగయ్యకు చెప్పి పంపించాడు. సంతోషపూర్వకంగా త్యాగయ్య మంత్రిని లోపకిలి ఆహ్వానించారు.

శరభోజి అనారోగ్యం గురించి త్యాగయ్యకు మంత్రి తెలియజేసి అనుగ్రహించమని ప్రార్థించాడు. త్యాగయ్య కొద్దిసేపు ధ్యానముద్ర వహించిన పిమ్మట మంత్రితో 'మీకు గనుక విశ్వాసం ఉంటే నేను ఇచ్చే తీర్థం తీసుకువెళ్ళి రాజుగారికి ఇవ్వండి. ఆయనకు స్వస్థత చేకూరుతుంది' అన్నాడు. మంత్రి మహదానందంతో సమ్మతించాడు. త్యాగయ్యతన పూజ అనంతరం ఒక రాగి పంచపాత్రలో తీర్థం పోసి రెండు మూడు తులసీదళాలు వేసి మంత్రికి అందజేశారు.

ఆయన భక్తిపూర్వకంగా ఆ పాత్రను తన పల్లకీలో ఉంచి రాజు వద్దకు తీసుకువెళ్ళాడు. మొదటి మోతాదు తీర్థం సేవించటంతో రాజుకు నొప్పి ఉపశమించింది, రెండో మోతాదుతో నొప్పి మటుమాయమైంది. మూడవ మోతాదుతో ఆయన పూర్తిగా కోలుకుని ఉల్లాసంగా లేచి కూర్చున్నాడు.

రామనామ సంకీర్తనలోని మహత్తరశక్తి ఎటువంటిదో శరభోజి అవగతం చేసుకున్నాడు. ఐహిక సుఖభోగాలను ఆశించక నిరంతరం సర్వేశ్వరుని స్మరిస్తూ లోకహితైషులుగా జీవితం గడిపే త్యాగ మూర్తులపై కక్షబూనటం శుద్ధ అవివేకమని గుణపాఠం కూడా నేర్చుకున్నాడు.

అనవతరం రామనామధ్యానాసక్తులై తరించిన కబీర్, రామదాసు, తులసీదాసు వంటి మహనీయులెందరో ఉన్నారు. పుష్టిని, తుష్టిని సమకూర్చేది రామరసం! కరకు బోయ తిరగేసి పలికినా కవిగా మలచిన నామం! అది దైహిక మానసిక రుగ్మతలను పోగొట్టగల దివ్య రసాయనం! అట్టి రామపాదుకలు మిమ్ములను సర్వదా కాపాడుగాక!!" అని బోధించారు శ్రీ బాబూజీ మహరాజ్.

# ప్రపంచాన్ని విడిచిపెట్ట నక్కర్లేదు

(శ్రీరామకృష్ణులు చెప్పిన కథ)

ఒకసారి శ్రీరాముడు తీవ్రమైన వైరాగ్య భావనలో మునిగి పోయాడు. దశరథుడు ఇది చూసి ఆందోళన చెందాడు. వశిష్ఠుడి దగ్గరకు వెళ్ళి రాముడిని సన్యసించకుండా నచ్చజెప్పమని అడిగాడు. ఆ మహర్షి రాముడి వద్దకు వెళ్ళి, రాముడు ముభావంగా ఉండటం గమనించాడు. ఆ యువరాజు మనస్సులో వైరాగ్య భావం జ్వలించి పోతోంది.

వశిష్ఠుడు శ్రీరామునితో "ఓ రామా! ఈ ప్రపంచాన్ని ఎందుకు విడిచిపెట్టాలి? ఈ ప్రపంచంలో భగవంతుని కంటే వేరైనదేమైనా ఉన్నదా? ఉంటే నాకు చెప్పు" అన్నాడు.

పరబ్రహ్మం నుండే ఈ ప్రపంచం ఏర్పడిందని శ్రీరామునికి అప్పుడు బోధ పడింది. రాజ్యాన్ని విడిచి సన్యసించాలనే ఆలోచనను శ్రీరాముడు అప్పుడు మార్చుకున్నాడు!

## శ్రీ మాతాజీవారి సత్సంగ కార్యక్రమాలు

బెంగుళూర్‌లో శ్రీమాతాజీ వారి సత్సంగ సమావేశములు 17-10-14 నుండి 19-10-14 వరకు జరుగును.

వివరాలకు: శ్రీ సాయిబాబాగారు ఫోన్ నెం. 09448 639553

# కర్మయోగ మహాత్మ్యం

- ఓం కాళి

పూర్వం జనస్థానం అనే గ్రామంలో కౌశిక వంశోద్భవుడైన ఒక బ్రాహ్మణుడు తన జాతి ధర్మాలను విడిచిపెట్టి, వైశ్యధర్మమైన వ్యాపారం చేస్తూ, వ్యభిచారంతో సహా సకల దుర్వ్యసనాలకు బానిసయై ఉండేవాడు. అతని సర్వ సంపదలను కోల్పోయాడు. ఉత్తరదేశంపోయి మరల వ్యాపారం చేసి, చాలా ధనాన్ని సంపాదించి తిరిగి ఇంటికి వస్తుండగా, దారిలో దొంగలముఠా అతడిని చావబాది, ధనం ఎత్తుకుపోయారు. అతడు మరణించాడు. ధర్మాచరణ లోపం వలన అతడొక భయంకరమైన ప్రేతగా మారి అడవులలో ఉండసాగాడు.



అతని కొడుకు ధర్మబుద్ధికల వేదవిద్వాంసుడు. చాలాకాలమైా బయలుదేరి వెళ్ళిన తండ్రి యింకా రాలేదేమిటాని యిల్లు విడిచి వెతుక్కుంటూ బయలుదేరాడు. దారిలో ఎందరిని అడిగినా సమాచారం దొరకలేదు. చివరికి ఒక స్నేహితుడి ద్వారా తండ్రి మరణవార్త తెలిసి, చాల దుఃఖించి, పరలోక క్రియలు చేయదలచి కాశీకి బయలుదేరాడు. 8రోజులు ప్రయాణం చేసి, 9వ రోజు తండ్రి మరణించిన ప్రేత అయిన చెట్టు క్రిందనే నిలబడి సేద తీర్చుకుని, సంధ్యోపాసన చేసి, భగవద్గీత మూడవ అధ్యాయమైన 'కర్మయోగ పారాయణ' చేశాడు.

ఆ సమయంలో ఆకాశం నుండి భయంకరమైన శబ్దం వినిపించింది. పైకి చూశాడు. భయంకరాకారంలో తన తండ్రి! అతనికి దగ్గరలోనే ఒక దివ్య విమానం! దాని కాంతి అన్ని ప్రక్కల ప్రకాశిస్తోంది! తన తండ్రి ఆ విమానం ఎక్కగానే అతనికి ఆ ప్రేత రూపం పోయి, దివ్య రూపం సంప్రాప్తించింది. మునులు, దేవతలు ఆయనను స్తుతిస్తుండగా, పుత్రుడు తన తండ్రికి నమస్కరించి ఆయన ఆశీస్సులు పొందాడు.

తండ్రి తన కుమారునితో యీ విధంగా చెప్పాడు "కుమారా! నీవు భగవద్గీతలోని మూడవ అధ్యాయమైన కర్మయోగ పారాయణ

చేశావు. అది విన్న నాకు సర్వకర్మలు రహితమైపోయి, బంధాలనుండి విముక్తుడనై, ప్రేతాత్మ నుండి విడువబడి ఈ దివ్యరూపాన్ని పొందాను. చాలా సంతోషం. నీవు కాశీకి వెళ్ళి చేస్తే వచ్చే పుణ్యకర్మ ఫలం అంతా ముందుగానే యీ కర్మయోగ పారాయణ వలన లభించింది.

కనుక నీవు ఈ పారాయణను మరల కొనసాగించి, నా సోదరుడు కూడా నాలాగే పాపకర్మలవల్ల దుర్గతిని అనుభవిస్తున్నాడు. నీవు అతనిని, నరకంలో ఉండే యితరులకు కూడా నరక బాధలను తప్పించి, పుణ్యలోక ప్రాప్తిని కలిగించు" అని ఆజ్ఞాపించి ఆ తండ్రి శ్రీ మహా విష్ణువు సన్నిధికి చేరుకున్నాడు.

తండ్రి ఆజ్ఞనను పాటించి, కుమారుడు తిరిగి తన గ్రామం చేరుకుని, ఎంతో శ్రద్ధాభక్తులతో కర్మయోగ పారాయణ చేసి, ఆ పుణ్యాన్ని నరకవాసులకు విముక్తి కలిగించటానికి ధారపోశాడు.

విష్ణుదూతలు యముని వద్దకు వెళ్ళి, నరకవాసులందరిని విడుదల చేయమని విష్ణుమూర్తి ఆదేశించాడు అని చెప్పగా, నారాయణుని ఆజ్ఞ పాటించి, యముడు ఆ నరక వాసులందరినీ విడిచిపెట్టాడు.

ఈ విధంగా ఆ బ్రాహ్మణ కుమారుడు తృతీయ అధ్యాయ పఠనం ద్వారా జీవులందరిని ఉద్ధరించి, తాను కూడా అంత్యకాలమందు ఆ దేవ విమానాన్ని అధిరోహించి శ్రీవిష్ణుధామాన్ని చేరుకున్నాడు.

మరణ కాలంలో సత్‌చింతనలో ఉంటేనే ముక్తి లభిస్తుంది.

కాబట్టి అంత్యకాలంలో భగవన్నామమే పరమ ఔషధంగా పనిచేస్తుంది. ఆ నామ స్మరణ అభ్యాసంతో అలవడుతుంది. కాబట్టి మనమందరము నామ స్మరణే ధన్యోపాయంగా చేసుకుని కడతేరే మార్గం చూసుకొనెదము గాక!



# అంతర్ దృష్టి - బాహ్యదృష్టి

- కామేశ్వరీ ప్రసాద

ఒకసారి దుర్యోధన మహారాజు కొలువుతీరి ఉండగా అక్కడకు నారదమునీంద్రులు వచ్చారు. నారాయణ నామస్మరణ చేస్తూ సభలో ప్రవేశించారు. దుర్యోధనుడు వారిని పూజించి కుశల ప్రశ్నలు అడుగుతూ "మునీంద్రా! తమరు ఎక్కడి నుంచి వస్తున్నారు?" అని అడిగాడు. దానికి నారదుడు "నాయనా! ఏ భక్తులైతే నిరంతరం కొలిచి పూజిస్తూ ఉంటారో, వైకుంఠంలో ఉన్న సాక్షాత్ ఆ పరమాత్మను దర్శించి వస్తున్నాను. మహానుభావులు ఏ పనులు చేసినా తత్త్వదృష్టితో చేస్తూంటారు. వారు సామాన్యులకు అందరు సుమా!" అన్నారు.

అది విని దుర్యోధనుడు అసలు జరిగిన విషయమేమిటి అని ప్రశ్నించాడు. నారుదుడు "దుర్యోధనా! వైకుంఠంలో పరమాత్మ ఏం చేస్తున్నాడో తెలుసా? ఒక ఏనుగును తెచ్చి సూది బెజ్జంలో ఎక్కించే ప్రయత్నం చేస్తున్నాడు" అన్నారు.

ఆ మాటలు విన్న దుర్యోధనుడు నవ్వి, "అంతేలే యింకేం చేస్తాడు. చిన్నప్పటి నుండి గొల్లవారి ఇండ్లలో పాలు, పెరుగు, మీగడ తిని, బుద్ధి మందగించి ఉంటుంది' అని వికటంగా నవ్వాడు.

ఆ తరువాత నారదుడు అక్కడి నుంచి తిన్నగా ధర్మరాజు దగ్గరకి వెళ్ళారు. ధర్మరాజు నారదమునీంద్రులను భక్తి శ్రద్ధలతో కొలచి, "స్వామీ! విశేషాలు ఏమైనా ఉంటే తెలియజేయండి" అని అడిగాడు. నారదుడు దుర్యోధనుడి దగ్గర చెప్పిన సంగతినే తిరిగి తెలియజేశాడు. అది విన్న ధర్మరాజు "మునీంద్రా! సకలచరాచర సృష్టి ఆ పరమాత్మ చేతిలో ఉండగా ఆయనకు సూదిలో ఏనుగును ఎక్కించటం ఒక లెక్కా!" అన్నాడు వినయంగా.

"నాయనా! దుర్యోధనుడు నీ లాగ అర్థం చేసుకోకుండా, పరమాత్మను ఒక మానవమాత్రునిగా చూసి అవహేళన చేశాడు. ఆ పరమాత్మను నిందించిన మాటలను వినలేక నీ దగ్గరకు వచ్చాను" అన్నాడు నారదుడు.

జ్ఞానిని జ్ఞానిమాత్రమే గుర్తించగలడు. ఆ పరమాత్మ మాటలకు అందుతాడా? మాయ ఆవరించినవాడు గుర్తించగలడా!

# దామోదరుడు

- రమణ ప్రసాద్

దుష్టశిక్షణకు, శిష్ట రక్షణ కొరకు అవతారమెత్తిన నారాయణుడు, దేవకీ వసుదేవులకు జన్మించి, నందయశోదల వద్ద పెరుగుతున్నాడు బాలకృష్ణుడుగా. అతని అల్లరి రోజురోజుకూ మితిమీరిపోతోంది. వ్రేపల్లె వాసుల పల్లెపడచులు చాడీలు రోజు వినలేకపోతున్నది యశోద. ఏం చేస్తే పిల్లవాడు దారిలోకి వస్తాడా అని ఆలోచించి ఒక రోజు, రెండు దెబ్బలు వేయాలని నిర్ణయించుకున్నది.

ఒక రోజు బెత్తం తీసుకుని బెదిరిస్తూ కృష్ణునితో "ఈ రోజు నీ పనిపడతా! ఇక ఊరుకునేదిలేదు కృష్ణా!" అంటూ వెనకాల పడింది. కృష్ణుడు ముందు పరుగెడుతున్నాడు. కాటుక కళ్ళు నులముతూ ఏడవటం మొదలుపెట్టి, తల్లి ఏ వైపునుంచి వస్తుందో అని దొంగచూపులు చూస్తున్నాడు. తీరా యశోద వచ్చి కృష్ణుని పట్టుకుని కొట్టటానికి చేతులు రాక, సరే పిల్లవాడిని కడదామని తాడు తెచ్చింది.



ఆది మధ్యాంతాలు లేని ఆ పరమేశ్వరుని ఆమె బంధించగలదా? విష్ణుమాయచేత ఇతడు నా బిడ్డడే అని తలచి ఆమె కట్టటానికి సాహసించింది. కాని అతడు చిక్కలేదు.

చిక్కఁడు సిరి కౌఁగిటిలోఁ
చిక్కఁడు సనకాది యోగి చిత్తాబ్జములన్
చిక్కడు శ్రుతిలతి కావళిఁ
చిక్కె నతఁడు లీలఁదల్లి చేతన రోలన్

అతడు ఏమైనా సామాన్యుడా! వేదవేదాలకుగాని, సనకాది

మునులకు గాని, లక్ష్మికిగాని చిక్కని ఆ దేవదేవుడు లీలా విలాసంగా ప్రేమమయి అయిన తల్లి యశోదకి చిక్క రోల కట్టబడ్డాడు.

అతనిని కట్టటానికి ఇంట్లో ఉన్న తాళ్ళు అన్నీ తెచ్చి జోడించినా కూడా చాలలేదు. ఎన్ని తాళ్ళు తెచ్చినా ఇంకా రెండంగుళాలు యెడం మిగిలేది. అలా శ్రమపడే తల్లిమీద జాలికలిగి ఆఖరుకి కట్టబడ్డాడు బాలకృష్ణుడు.

జ్ఞానులచే మౌనులచే
దాలుచే యోగ సంవిధానుల చేతన్
బూని నిబద్ధుండగునే
శ్రీనాథుడు భక్తియుతుల చేతంబోలెన్

జ్ఞానులచేతగాని, మునులచేతగాని, దానములచేయువారి చేతనుగాని శ్రీనాధుడు బంధింపబడతాడా? ఒక్క భక్తిచేతనే బంధింపబడతాడు.

భగవంతుడి లీలలు ఒక ప్రణాళిక ప్రకారం జరుగుతాయి. కట్ట బడిన రోలుని రెండు మద్దిచెట్ల మధ్యగా తీసుకెళ్ళగా ఆ వృక్షాలు కూలి కుబేర పుత్రులైన హయగ్రీవ, నలకుబేరులు అనే ఇద్దరు మూర్ఖులు శాప విముక్తులై, వారు ఆ దామోదరుని లీలలను అనంతంగా కొనియాడారు. అట్టి లీలా వినోదుని లీలలను మాటిమాటికీ స్మరించి మనం అందరమూ కూడా ఆ ఆనందంలో ఓలలాడదాం!!



(గత సంచిక తరువాయి) **సత్సంగామృతం** - మురళీ

నువ్వు ఎన్ని రూపాలలో ఆరాధించినా, ఉన్నది ఒకే పరమాత్మ. మహాత్ముల దృష్టి ఎప్పుడూ కూడా శ్రేయోదాయకమైనటువంటిదే. మామూలుగా అయితే గురువులు హృదయం చూస్తారు అంటారు. కాని మన అనుభవంలో మన గురుదేవులు సమస్తమూ చూస్తున్నారు. అప్పటి నుంచి ఇప్పటికీ చూస్తూనే ఉన్నారు. మనం వారిని ఇంద్రియాల ద్వారా చూడ లేకపోతున్నాము. కాని మన ఆలనా పాలనా ఆయనే చూస్తున్నారు. కడుపుకి, హృదయానికి కూడా అందిస్తున్నారు. మనం అందుకోవటంలో ఉంది.

మనల్ని మనమే మెచ్చుకోవటం, ఇతరులు మనల్ని మెచ్చుకోవటం వంటివి మాయకు సంబంధించినవి. మన ప్రభువు యొక్క ఆనందాన్ని సర్వకాల సర్వావస్థల యందు ఎందుకు పొందలేక పోతున్నాము? దానికి ఏమి అడ్డువస్తోందనే విషయాన్ని గుర్తించి, దానిని నివారించుకోవాలి. నిత్యమైన బ్రహ్మానందానుభూతిని ప్రసాదించేవారు మహాత్ములు. మనలో గుణదోషముందని కూడా మనకు తెలియదు. అటువంటివారిని గురు శిక్షణలో ఉంచితే శిక్షణ అవుతుంది. శిక్ష కాదు. శిక్ష అయితే బయటకు రావటం నీ వల్ల కాదు. దేవుడు శిక్ష వేసినా దానిని శిక్షణగా మార్చి బయటకు తీసుకురాగలరు గురుదేవులు. దేవుడు శపించినా గురుదేవులు అనుగ్రహించి రక్షించగలరు. కాని గురుదేవులే శపిస్తే దేవుడు కూడా ఏమీ చేయలేడు. అసలు మనం శాపం వరకు ఎందుకు తెచ్చుకోవాలి? లేనిపోని అనుమానాలు, నేనేం తప్పు చేస్తున్నానని తప్పులు వెతుక్కోవద్దు. అంతటా బ్రహ్మానందం ఉంది కదా! నేనెంత వరకు పొంద గలుగుతున్నానని విమర్శించుకోండి. దానికి కారణం మీరే కదా! ఎంత వరకు మనస్సు దానిలో మునగగలుగుతోంది? దానికి సమయం అంటూ లేదు. అహర్నిశలు దానియందే ఉండాలి. గురుదేవులు 'నేను పట్టుకునే ఉన్నాను. నువ్వే వదిలించుకుంటున్నావు' అంటున్నారు.

గురుదేవులు మనకు తమ అమూల్యమైన సమయాన్ని అనుగ్రహించారు. దానిని మనం నిక్షిప్తం చేసుకోవాలి. దానిని గుర్తించి

మనమే అవకాశం కోసం వారి వెంట పడాలి. వారి వెంట పడినప్పుడు నీ మనస్సు ఎక్కడ ఉంటుంది? ఈ విషయాన్ని గుర్తింపజేయటానికే గురుదేవులు మనం వారి ఎదుటకు వెళ్ళినప్పుడు, దేనివలన మనం బ్రహ్మానందాన్ని కోల్పోతున్నామో అక్కడ శిక్షణ జరుగుతుంది. గురుదేవులు ఎప్పుడూ చెప్పేవారు 'రెండు పూటలా ప్రార్థన చెయ్యి, సాధన అంతా అందులోనే ఉన్నది. ప్రార్థన సమయంలో ఏదైనా పనిలో ఉన్నావనుకో కాసేపు కళ్ళు మూసుకుని 'ప్రభూ! నీ అనుగ్రహం. ఈ పని నువ్వే చేయిస్తున్నావు' అని ధ్యానించుకో. ఒకవేళ నీకు తృప్తి కలుగలేదు అప్పుడు ఇంటికి వచ్చాక ప్రశాంతంగా ధ్యానం చేసుకో. పొలం పనులకు వెళ్ళేవారు (నిడమర్రు గ్రామస్థులు) ముడు పూటలా నారాయణోపనిషత్తు పారాయణ చేస్తున్నామని చెప్పారు. కుర్చీలో కూర్చుని ఉద్యోగం చేసేవారు చెయ్యలేరా? డ్రైవింగ్ చేసే వారు కూడా చేసుకోవచ్చు.

ఆ మహాత్ముని అనుగ్రహం లేకపోతే నీవు మంచినీరు కూడా త్రాగలేవు. ప్రతి విషయంలో గురు అనుగ్రహం మనకు ఏవిధంగా లభిస్తుందో గుర్తించాలి. రెండు పూటలా ప్రార్థన చేసుకోవటం కోసం తగిన శ్రద్ధ మనమే వహించాలి. మన ఇల్లు మనమే చక్కబెట్టుకోవాలి కదా! మన ఆరోగ్యం మన మంచిచెడ్డలు మనమే చూసుకోవాలి కదా! కుంటిసాకులు చెప్పి ప్రార్థన ఎగగొట్టకూడదు. ధ్యానం ఒక నిర్ణీత సమయంలో చేసుకోవటమనేది క్రమశిక్షణ. అది గురుముఖతః వచ్చిన మాట. భగవంతుడు మనకు అందుబాటులో ఉంటాడు. రెండుపూటలా ధ్యానం చేసితీరాలి. నిద్ర సరిపోకపోతే ప్రార్థన అయ్యాక వెళ్ళి పడుకో. కావలసినంత విశ్రాంతి దొరుకుతుంది. నిన్ను నువ్వు సోమరిని చేసుకుని, నిన్ను నువ్వు మోసపుచ్చుకుని, అజ్ఞానంలో పడిపోవద్దు. నిన్ను నువ్వు లేపుకోవటానికి అసమర్థుడవైపోతావు. దీనిని గుర్తుంచుకుని క్రమశిక్షణతో ప్రార్థన చేసుకోగలిగితే భగవంతుడెక్కడుంటాడు? మన తలలో, తలపులలో, ఉంటాడు. భిన్నంగా ఉండడు. మనల్ని విడిచిపెట్టి దేవుడు ఉండగలడా? మనవెంటబడి మనతో కూడా ఉండి మనకు కావల్సిన సహాయం అందజేస్తాడు.

-సశేషం

(గత సంచిక తరువాయి) **హనుమద్వైభవము** - సుషుమ్న ప్రసాద

బాలహనుమ వనములో తిరుగుతూ కపిచాపల్యంతో అక్కడ తపస్సు చేసుకుంటున్న మునుల సమిధలను, కుశవల్కలాదులను నదిలో పారవేస్తుండేవాడు. అప్పుడు మునులు కోపగించి హనుమతో "నీవు మహాబలవంతుడవైన నీ బలాన్ని నీవు విస్మరిస్తావు. ఇతరులు జ్ఞాపకం చేస్తే కాని, నీ బలము నీకు స్ఫురణకు రాదు" అని శపించారు.

తరువాత హనుమ సూర్యుని వద్దకు వెళ్ళి విద్యను అభ్యసించి సర్వశాస్త్ర అధ్యయనం చేశాడు. అలా భాస్కరానుగ్రహంతో సకల శాస్త్ర పారంగతునిగా, వ్యాకరణమును క్షుణ్ణంగా నేర్చుకొని, నవవ్యాకరణపండితుడయ్యాడు.



హనుమంతుడు కిష్కింధకాండలో రంగ ప్రవేశం చేస్తాడు. ఆయన సుగ్రీవునకు నమ్మినబంటు. ప్రధానమంత్రివర్యుడు. సుగ్రీవుడు అన్నగారైన వాలిచే ఓడింపబడి, క్లిష్ట దశలో మనుగడే ప్రశ్నార్థకమైన దశలో, ధీశాలి, సమయస్ఫూర్తిగల మంత్రిగా, సుగ్రీవుని, ఋష్యమూక పర్వతముపై ఉండమని సముచితమైన సలహాయిచ్చాడు. ఎందుచేతనంటే వాలికి ఋష్యమూకముపైకి వస్తే ప్రాణాపాయమనే శాపం ఉన్నది. అందువల్ల ఆ ప్రదేశము సుగ్రీవునికి చాలా క్షేమదాయకం అని దూరదృష్టితో సలహా యిచ్చాడు.

రామలక్ష్మణులిద్దరూ అరణ్యవాసంలో సీతాపహరణము తరువాత ఆ మహాసాధ్విని వెతుకుతూ, కిష్కింధలో ప్రవేశించారు. పర్వత శిఖరం నుండి సుగ్రీవుడు, హనుమ మహాతేజో సంపన్నులై, తాపస వేషధారులైన ఆ రాకుమారులిద్దరినీ చూశారు. సుగ్రీవుడు వారు తమపైకి దండయాత్రకి వస్తున్నారేమోనని, ఎవరో ఆ అపరిచిత వీరులని భయ కంపితుడైనాడు. వెంటనే తన కుడిభుజమైన హనుమను వారి రాకకు కారణం గ్రహించటానికి, దూతగా పంపాడు.

మారుతి మహామేధా సంపన్నుడు. సత్త్వ తేజస్సుతో విరాజిల్లుతున్న ఆ మహిమాన్వితుల వద్దకెలా వెళ్ళాలా అని సుదీర్ఘంగా ఆలోచించి,

కామరూప వరసంపన్నుడు కాబట్టి తాను కోరిన రూపాన్ని ధరించగల సమర్థుడు అవటంచేత మానవాకారంలో వేదవేదాంగాలు క్షుణ్ణంగా అభ్యసించిన బ్రాహ్మణ భిక్షుక రూపంలో రామలక్ష్మణులను సమీపించి, సంస్కృత భాషలో సంభాషించటం సముచితమని భావించాడు.

తన ప్రభువు, ఆరాధ్యదైవము, గురుదేవుడైన శ్రీరామచంద్ర ప్రభువుతో ప్రథమ సమాగమము. రామలక్ష్మణుల ముగ్ధ మనోహర రూపం చూడగానే హనుమ హృదయం ఆనంద పారవశ్యంతో పరవళ్ళు తొక్కింది. వారి విచారగ్రస్త వదనాలు చూడగానే మనస్సు ఆందోళనకు లోనైంది.

అలాగే శ్రీరామచంద్ర ప్రభువుకు తానెంతకాలంగానో ఎదురు చూస్తున్న ఆంతరంగిక భక్తుడు, అనుంగు బిడ్డడు, ప్రియశిష్యుడైన హనుమను చూడగానే ఎద ఆనంద కెరటాలతో ఉప్పొంగిపోయింది. గురుశిష్య సమాగమము రాక్షస సంహారానికి నాంది. హనుమ భిక్షుక రూపంలో వారితో సంస్కృతంలో సంభాషించాడు.

ప్రసన్నాంజనేయుని ప్రసంగ విధానానికి ముగ్ధుడై శ్రీరామ చంద్రుడు లక్ష్మణునితో యిలా ప్రశంసించాడు. “లక్ష్మణా! భిక్షుక రూపంలో ఉన్న యీ వ్యక్తి వాక్చాతుర్యము అభినందనీయము. ఋగ్వేద, సామవేద, యజుర్వేదములలో నిష్ణాతుడుకాని వాడిట్లు సంభాషించలేడు. ఇతని వాక్చాతుర్యము కడు శ్లాఘనీయము. ఇతడు సమస్త వ్యాకరణాన్ని సాంగోప సాంగంగా పఠించాడన్నది నిస్సంశయము. ఈ అపరిచితుని సంభాషణలో ఒక్క అపభ్రంశపు మాట కూడా దొర్లలేదు. మాట్లాడేటప్పుడు అతని ముఖ కవళికలలో ఎటువంటి వికారము లేదు. ఇతని మాటలు సంస్కార భరితమై, అధిక ప్రసంగానికి తావీయకుండా, ఏకథాటిగా మాట్లాడాడు. తన వాక్పటుత్వము, వాక్కౌశల్యంతో కత్తి ఎత్తిన శత్రువునైనా లొంగదీసుకో గలడు. ఇట్టి వ్యక్తి దూతగా కల రాజు యెట్టి జటిలమైన కార్యమునైనా సులువుగా సాధించగలడు” అని తన అనుజునితో హనుమ ప్రతిభా పాటవాన్ని మెచ్చుకున్నాడు.

ఇక్కడ రామచంద్రుడు ఎంతో దూరదృష్టితో లంకలో హనుమంతుడు చేయబోయే దౌత్యమును గురించి సూచనగా చెప్పాడు.

-సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

గత సంచిక తరువాయి

- విజయేశ్వరానంద ప్రసాద్

**శ్రీ లలితానంద సరస్వతి స్వామి (గురువుగారి)తో శ్రీబాబు**

బంగారాన్ని పుటం పెడితే మరింత కాంతితో ప్రకాశిస్తుంది. అలాగే జన్మతః ఉత్తమ సంస్కారంగల వారికి, తమలో మిగిలి ఉన్న గుణాలను సరిదిద్దుకోవటానికి, సకల కళ్యాణ గుణాభిరాముడైన భగవానుని పరిపూర్ణ అనుగ్రహానికి పాత్రులై, సగుణ నిర్గుణాతీతమైన స్వస్వరూపాను సంధానమును పొందటానికి, ఎన్నో కష్టాల రూపంలో పరమేశ్వరుడు మహదవకాశాలను కల్పిస్తాడు. ఆ కష్టాల నుండి వారిని గట్టెక్కించటానికి మళ్ళీ తానే గురురూపం ధరించి వచ్చి, వాళ్ళకు తనయందు ఎనలేని అనురక్తిని పెంపొందించి, వారి హృదయ క్షేత్రంలో భక్తిబీజాలను నాటి, అవి మొలకెత్తి పండించే దివ్య జ్ఞానశక్తితో భవ పాశాలను ఛేదించి, ముక్తిని పొందింప జేస్తాడు. ఈ సత్యము మనకు ప్రతి భక్తుని చరిత్రలోనూ అవగతమవుతుంది. ఈ సత్యమే గురువుగారి విషయంలోనూ, ఇందిర విషయంలోనూ స్పష్టమైంది.



అలాగని భగవంతుని కృప ఉత్తమ సంస్కారులకే లభిస్తుందని భావించరాదు. పుటం పెడితే బంగారం ఇంకా ప్రకాశించే మాట నిజమే కాని, గురువు అనే స్పర్శవేది ఇనుము వంటి కుసంస్కారులను కూడా తన దర్శన, స్పర్శన, వందన, భాషణముల ద్వారా బంగారం వంటి శుద్ధ సంస్కారులుగా మార్చి, శాశ్వతంగా ప్రకాశింపజేసే శక్తి కలది. అనుగ్రహ వీక్షణ, అనుక్షణ శిక్షణ, పరీక్షా రక్షణ, దీక్షా దక్షతా లక్షణ పరిరక్షితులే శ్రీ గురుదేవులు.

ఇంకొక అడుగు ముందుకువేసి చెప్పుకోవాలంటే, ఉత్తమ సంస్కారులు పాత్రతః ఉత్తీర్ణతకు యోగ్యులై ఉన్నవారే. వారు ఎలాగైనా తమను తరింపజేసే సద్గురువులను వెతుక్కుని ఆశ్రయిస్తారు. సద్గురువు వారిని తరింపజేయటానికి ఎక్కువ శ్రమపడనవసరం లేదు. కాని హీన

సంస్కారులకు తాము సంసారమనే సముద్రంలో మునిగి ఉన్నామని గాని, దాని నుండి తరించవలసిన అవసరం ఉన్నదనిగాని తెలియదు. అటువంటివారిని చేపట్టి, వారిని ఉత్తమ సంస్కారులుగా తీర్చిదిద్ది తరింప జేయటానికి ఎంతో సహనమూ, సామర్థ్యమూ, సహజ జీవ కారుణ్యమూ అవసరం. దయామయులైన సద్గురువులు, తామే వారిని వెదుక్కుని తమ దగ్గరకు చేర్చుకుని, ఆత్మానందానుభూతిలో అనవరతము ఓలలాడే తమ అమూల్య కాలమును కూడా వారి కోసం వెచ్చించి, వారిని తరింప జేసేవరకు విడువరు. అటువంటివారే సమర్థ సద్గురువులు. శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్ వారే అందుకు దీటైన ఉదాహరణము.

శ్రీబాబు గురువుగారికి కోటప్పకొండ యాత్ర సమయంలో ఒక మహత్తరమైన దివ్యానుభూతిని ప్రసాదించారు. ఒకసారి భక్తులందరిని శ్రీబాబు కోటప్పకొండ యాత్రకు తీసుకువెళ్ళారు. శ్రీకోటేశ్వర స్వామి దర్శనము, పూజాదికములన్నీ పూర్తి అయ్యాక అందరూ విశ్రాంతి తీసుకుంటున్నారు.

అది సాయం సమయం. చీకటి పడబోతున్నది. శ్రీబాబు తమ గదిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. గురువుగారు శ్రీబాబు గదిలో లైటు వేద్దామని వెళ్ళారు. లోపలికి వెళ్ళి స్విచ్ వేయగానే లైట్ వెలగటం, వెంటనే ఆరిపోపటం జరిగింది. కరెంట్ పోయిందని భావించిన గురువుగారు వెంటనే బయటకువెళ్ళి ఒక పెట్రోమాక్స్‌లైట్ వెలిగించి తెచ్చారు. గదిలోకి రాగానే అదీ ఆరిపోయింది. వెళ్ళి మళ్ళీ వెలిగించుకుని వచ్చారు. మళ్ళీ ఆరిపోయింది. మూడోసారి కూడా ఇలా జరిగేసరికి గురువుగారు ఆశ్చర్యపోయి, యిలా జరగటానికి ఏదో కారణం తప్పక ఉంటుందని మనస్సులో అనుకున్నారు.

అంతలో గది అంతా కోటి సూర్యులకాంతితో నిండి కళ్ళు చెదిరేటట్లు కనిపించింది. ఎటు చూసినా వెలుగు సముద్రమే తప్ప మరేది కనిపించటం లేదు. శ్రీబాబు పడుకున్నవైపు చూస్తే వారు కనిపించటం లేదు. కాని శ్రీబాబు ఉన్నచోట పెద్ద కాంతిగోళం కనిపించింది.

-సశేషం

విష్ణు  కథలు

-రమణ ప్రసాద్

## 8. సదాశివ బ్రహ్మేంద్ర సరస్వతి

"నేను పరిశుద్ధ జ్ఞాన స్వరూపుడను. సదానంద స్వరూపుడను. అంతరాత్మను నేనే. సర్వ వ్యాపకమైన సత్తా స్వరూపమును నేనే. ఉపనిషత్తులు ఘోషించే బ్రహ్మమును నేనే. నేను నిత్యుడను. భయ రహితుడను. అద్వితీయుడను. నేను జ్ఞాన స్వరూపుడను. నేను కేవలము సాక్షీ మాత్రుడను, పక్షపాతరహితుడను. మోక్షస్వరూపుడను. ఓంకారముచే తెలియబడువాడను. సూక్ష్ముడను, నిష్కళంకుడను, ఆత్మ స్వరూపుడను. సదా జ్ఞాన స్వరూపుడను."



స్వామి ఒకసారి కుర్తాలం జలపాతం నుండి తిరునల్వేలికి వస్తూ ఉండగా, మార్గ మధ్యంలో కట్టెల వ్యాపారం చేసే వారు స్వామిని 'ఏయ్ ఇలారా ! నీవు ఒక కట్టె మొద్దు లాగానే ఉన్నావు. ఈ కట్టెలను తీసుకు వెళ్ళి ఆ ప్రోగులో వెయ్యి' అని కట్టెమోపులను స్వామి నెత్తిన పెట్టారు. స్వామి మారుపలకక శ్రమించి మోశారు. పని పూర్తి చేసి వెళుతుండగా 'ఓ మొద్దూ! ఎంత వరకు నీ ప్రయాణము?' అని ఎగతాళి చేశారు. అట్టి వారు మానవులు కారు. రాక్షసత్వానికి ప్రతిరూపాలు. సదాశివులవారు నవ్వుతూ నడక సాగించారు.

స్వామికి జరిగిన అన్యాయానికి అగ్నిదేవుని హృదయం భగ్గుమంది. చూస్తూండగానే కట్టెమోపులు కాలి భస్మమయ్యాయి. తమ తప్పు తెలుసుకొన్న కట్టెల వ్యాపారస్తులు సదాశివుల వారిని క్షమాభిక్ష కోరాలనుకున్నారు, కాని అప్పటికే స్వామి వారికి అందకుండా వెళ్ళిపోయారు. ఆత్మజ్ఞాన విలతుడై అవధూత వలె సంచరిస్తున్న సదాశివ బ్రహ్మేంద్రుని పిచ్చివాడని పిలువసాగారు. పరమ శివేంద్ర స్వాముల వారి దగ్గరకు వెళ్ళి 'మీ శిష్యుడు పిచ్చివాడు అయ్యాడు' అని చెప్పారు.

ఒక నాడు ఒక ఛాందస బ్రాహ్మణుడు సదాశివబ్రహ్మేంద్రులవారిని

"నీ ప్రవర్తన శాస్త్ర సమ్మతంకాదు. అవదూతలా నటిస్తూ లోకాన్ని మోసం చేస్తున్నావు." అని తీవ్రంగా దూషించాడు.

అంతా మౌనంగా విన్న సదాశివబ్రహ్మేంద్రులవారు నదీ తీరంలో నిలబడిన చాకలివాడిని సమీపించి వాడిని నోరు తెరవమని సైగచేసి అతని నాలుకపై కొన్ని అక్షరాలు రాశారు. అంతే! నిరక్షర కుక్షి అయిన చాకలి వేదమంత్రాలను ఉచ్ఛరించాడు. బ్రాహ్మణునికి జ్ఞానోదయం అయింది. సదాశివేంద్రుల అనుగ్రహంతో చాకలివాడు పండితుడు అయ్యాడు. కలత చెందిన మనస్సుతో కన్నీరు కారుస్తూ తను తరించే మార్గం తెలియ చేయమని సదాశివులవారి పాదాలపై పడి దు:ఖించాడు. తన చింత తీరే మార్గాన్ని బోధించి అనుగ్రహించమని ప్రార్థించాడు. సదాశివేంద్రుల వారు తరుణోపాయంగా ఒక కీర్తనను రచించి ఇచ్చారు-

*చింతా నిస్తి కిల తేషాం*
*శమదమ కరుణా సంపూర్ణానాం*
*సాధుసమాగమ సంకీర్ణానాం* ॥ చింత ॥
*కాలత్రయ జిత కందర్పానాం*
*ఖండిత సర్వేంద్రియ దర్పాణాం* ॥ చింత ॥
*పరమహంసగురు పద చిత్తానాం*
*బ్రహ్మానందామృత మత్తానం* ॥చింత ॥

చింతయే లేదు. వారికి చింతయే లేదు. ఎవరికి?-

ఇంద్రియాలను అరికట్టినవారికి మనస్సును నిగ్రహించిన వారికి, దయార్థ హృదయులకు, మహాపురుషుల సంశ్రయము బడసినవారికి చింతయేలేదు. త్రికాలములందు కామాన్ని జయించి, ఇంద్రియముల గర్వము అణచినవారికి చింతయేలేదు. సద్గురోత్తముడైన పరమహంస గురుదేవుల చరణాలను ఆశ్రయించిన వారికి, బ్రహ్మానందం పానం చేసి తృప్తి చెందిన వారికి చింతలేదు! చింతరాదు!"

- సశేషం

## హైదరాబాద్ శాఖ భవన నిర్మాణం

ప్రియాత్మ బంధువులారా!

హైదరాబాద్‌లో ఉన్న ఆశ్రమ ప్రాంగణంలో ఐదు అంతస్థుల భవన నిర్మాణం చేయాలని సంకల్పించటమైనది అన్న విషయం బాబూజీ మహరాజ్ భక్తులమైన మనందరికీ తెలిసినదే. ధనాభావం చేత 5వ అంతస్థు నిర్మాణం ఆపివేసి 4అంతస్థులకు స్లాబులు వెయ్యటం జరిగింది. భక్తులు ఇప్పటివరకు ఇచ్చిన విరాళాలతో తదితర నిర్మాణపు పనులు కూడా చురుకుగా సాగుతున్నాయి.



పూజ్య మాతాజీవారు ఈ నూతన భవన ఆవిష్కరణకు, శ్రీ సద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠకు జనవరి 22వ తేదీ తెల్లారుజామున 1గం॥35నిలకు ముహూర్తం కూడా నిర్ణయించినారు. కనుక భక్తులందరూ ఈ బృహత్కార్యంలో పాల్గొని, వస్తురూపంలోకాని, ధనరూపంలోకాని తమ సహాయ సహకారాలను అందించమని ప్రార్థిస్తున్నాము. భక్తులు విరివిగా విరాళాలు అందించి శ్రీ మాతాజీ నిర్ణయించిన సమయానికి ఈ భవన నిర్మాణం పూర్తి చేయటానికి తోడ్పడమని విన్నవించు కుంటున్నాము.

మీ విరాళాలను క్రాస్ చేసిన చెక్కు లేక డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా పంపగోరుతున్నాము. ఇతర వివరాలకు శ్రీకుమారస్వామి రాజాగారిని (సెల్ నం.09346535357) సంప్రదించి తెలుసుకోవలసిందిగా కోరుతున్నాము. మీరు ఇచ్చే విరాళాలకు ఐ.టి సెక్షన్ 80 జి రాయితీ లభిస్తుంది.

శ్రీబాబు భక్త సమాజ్ (హైదరాబాద్)

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL